వాస్తవాలు పలుకు
DD9 వార్త
తెలుగు దినపత్రిక
TGTEL/26/A2635
హైదరాబాద్ | సంపుటి: 06 | సంచిక: 130 | 21-09-2026 | సోమవారం | పేజీలు: 10 | వెల: 3/-


2

## ఖైరతాబాద్‌లో కాంగ్రెస్‌కు రాజకీయ నిమజ్జనం

- కేంద్రమంత్రి బండిసంజయ్‌వ్యాఖ్య
- కాంగ్రెస్‌కు పోటీ చేసే సత్తా లేదంటూ ఎద్దేవా
- దానం నాగేందర్ వ్యాఖ్యలపై స్పందన
- 'వినాయకుడితో పోల్చుకోవడం సరికాదు'
- నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్ష
- కాంగ్రెస్ ఫాంహౌస్ పర్యటన ఓ జోక్


2

## రాహుల్ మిమిక్రీపై ఫడ్నవీస్ సెటైర్లు

- ఇండోర్ 'ఛాత్రోంకీ గూంజ్'లో వివాదాస్పద ఘటన
- మోదీని అనుకరించిన కమెడియన్ పుల్కిత్ మణి
- రాహుల్ సమక్షంలో మిమిక్రీపై బీజేపీ అభ్యంతరం
- స్టాండ్‌అప్ కమెడియన్‌గా మారితే ఉద్యోగమంటూ ఫడణవీస్
- కాంగ్రెస్‌ను నిరుద్యోగ పార్టీగా మార్చారంటూ ఎద్దేవా
- రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ నేతల విమర్శలు
- మిమిక్రీపై కాంగ్రెస్ నేత రషీద్ అల్వీ సమర్థన
- సాధారణ మిమిక్రీలో తప్పేమీ లేదన్న కాంగ్రెస్ నేత


2

## బీఎండబ్ల్యూ కారు బోల్తా.. ముగ్గురు మృతి

- కోస్టల్ రోడ్ బ్రిడ్జ్‌పై నుంచి జారిపడ్డ కారు
- తెల్లవారుజామున ముంబయిలో ఘోర ప్రమాదం
- మెరైన్ డ్రైవ్ నుంచి హాజీ అలీ వైపు ప్రయాణం
- ప్రమాద సమయంలో కారులో నలుగురు
- అతివేగమే కారణమా? పోలీసుల దర్యాప్తు

## ధరణి పేరుతో పేద రైతులకు తీవ్ర అన్యాయం


2

- ధరణితో పేద రైతులు నష్టపోయారన్న ఈటల
- కాస్తు, అనుభవదారి కాలమ్స్ తొలగింపుపై అభ్యంతరం
- పాత భూ రికార్డులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని వ్యాఖ్య
- భూ భారతి నేపథ్యంలో మళ్లీ తెరపైకి భూ హక్కుల అంశం



# వర్ధమాన దేశాలపై నిందలేస్తారా?

- ప్రధాని నరేంద్ర మోదీ మండిపాటు
- అభివృద్ధి చెందిన దేశాల తలసరి ఉద్గారాలు ఆరు రెట్లు ఎక్కువ
- వాతావరణ మార్పులపై భారత్ వాదన
- పారిస్ లక్ష్యాల సాధనలో భారత్ ముందంజ
- వర్ధమాన దేశాలపై నిందలకు వ్యతిరేకత
- ప్రపంచ వేదికలపై భారత్ స్పష్టమైన వైఖరి
- అభివృద్ధి–పర్యావరణ సమతుల్యతపై సీజేఐ
- పర్యావరణ న్యాయంపై సుప్రీంకోర్టు దృష్టి
- యువత ఉపాధికి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు
- రూ.లక్ష కోట్ల ఉపాధి ప్రోత్సాహక పథకాలు
- రోజ్‌గార్ మేళాలో 51 వేలకుపైగా నియామకాలు

**ఢిల్లీ, (డీడీ9 వార్త):** వాతావరణ మార్పులకు వర్ధమాన దేశాలనే బాధ్యులుగా చూపడం అసమంజసమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. భారత్‌తో పోలిస్తే అభివృద్ధి చెందిన దేశాల తలసరి కర్బన ఉద్గారాలు ఆరు రెట్లు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ప్రపంచ తలసరి కర్బన ఉద్గారాల్లో భారత్ వాటా చాలా స్వల్పమని చెప్పారు. పర్యావరణం, వాతావరణ మార్పులపై దిల్లీలో జరుగుతున్న రెండ్రోజుల అంతర్జాతీయ సదస్సును శనివారం మోదీ

మిగతా 2 లో..

# వారం రోజులు భారీ వర్షాలు

- 24 జిల్లాలకు ఎల్లో అలర్ట్
- నేటి నుంచి భారీ నుంచి అతిభారీ వర్షాలు
- గంటకు 40–50 కి.మీ. వేగంతో ఈదురుగాలులు
- ఉరుములు, మెరుపులతో వర్షాలు
- అల్పపీడనం మరింత బలపడే అవకాశం
- 21న వాయుగుండంగా మారే సూచనలు
- 22న తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం
- 23న ఒడిశా–ఏపీ తీరాలకు చేరువగా అల్పపీడనం
- 20 నుంచి 25 వరకు ఏపీ, తెలంగాణలో వర్షాలు
- పలు జిల్లాలకు ప్రత్యేక హెచ్చరికలు



**హైదరాబాద్, (డీడీ9 వార్త):** తెలంగాణలో నేటి నుంచి వారం రోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలపడే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని 24 జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా గంటకు 40-50 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

**24 జిల్లాలకు ఎల్లో అలెర్ట్**

జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ

మిగతా 2 లో..

# వ్యవస్థ విద్యార్థుల ప్రశ్నలకు భయపడుతోంది

- లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్
- 'అంధ భక్తుల'పై రాహుల్ విమర్శలు
- విద్యార్థుల్లో కుతూహలం, ప్రేమ, అణకువ
- దేశ భవిష్యత్తు యువతేనన్న కాంగ్రెస్ నేత
- అదానీ, అంబానీ, జై షాపై ప్రస్తావన
- 10 లక్షల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ
- లక్ష పాఠశాలలు మూతపడ్డాయన్న ఆరోపణ
- విద్యా బడ్జెట్‌పై రాహుల్ విమర్శలు
- మోదీ, షా, భాగవత్‌పై ఆరోపణలు
- ఇందౌర్‌లో విద్యార్థులతో రాహుల్ భేటీ

**ఢిల్లీ, (డీడీ9 వార్త):** దేశంలోని వ్యవస్థ విద్యార్థులు ప్రశ్నించడం కోరుకోవడం లేదని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ప్రశ్నించే విద్యార్థులకంటే 'అంధ భక్తులను' వ్యవస్థ కోరుకుంటోందని వ్యాఖ్యానించారు. దేశంలో ద్వేషాన్ని తరిమికొట్టే శక్తి విద్యార్థులకు ఉందని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లోని ఇందౌర్‌లో శనివారం నిర్వహించిన 'ఛాత్రోం కీ గూంజ్' కార్యక్రమంలో విద్యార్థులతో రాహుల్ సమావేశమయ్యారు.

ఏ దేశానికైనా యువతే భవిష్యత్తు అని రాహుల్ అన్నారు. విద్యార్థులు కుతూహలం, ప్రేమ, అణకువ, సహనం, నిజాయతీతో ఉంటారని పేర్కొన్నారు. వ్యవస్థపై ప్రశ్నలు సంధిస్తున్న విద్యార్థులను కొందరు వ్యతిరేకిస్తున్నారని ఆరోపించారు. అదానీ, అంబానీ, జై షా సహా వ్యవస్థ గురించి విద్యార్థులు ప్రశ్నిస్తున్నారని చెప్పారు.

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్, పారిశ్రామికవేత్తలు ముకేశ్ అంబానీ, గౌతమ్ అదానీలపై రాహుల్ ఆరోపణలు చేశారు. దేశంలోని రాజకీయాలు, వ్యాపారం, న్యాయవ్యవస్థ, అధికార యంత్రాంగం, విద్య,

మిగతా 2లో..



# కాంగ్రెస్ పాలనతో ఎవరికీ లాభం లేదు

- మహిళలకు రూ.2,500 హామీపై ప్రశ్న
- 2 లక్షల ఉద్యోగాల హామీపై నిలదీత
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై విమర్శ
- సాధారణ యువతకు ఉద్యోగాలు లేవన్న ఆరోపణ
- రేవంత్ కుటుంబం, సన్నిహితులకే ఉద్యోగాలంటూ వ్యాఖ్య
- కాంగ్రెస్ పాలనలో ఒక్క కాల్వా తవ్వలేదని ఆరోపణ
- భూకబ్జాలపై మాట్లాడితే దాడులంటూ ఆగ్రహం
- ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సవాల్
- రాష్ట్ర నిధుల కోసం దిల్లీలో పోరాడాలని సూచన
- మోతకొండూరులో హరీశ్‌రావు విమర్శలు

**హైదరాబాద్, (డీడీ9 వార్త):** కాంగ్రెస్ పాలనతో ప్రజలకు ఎలాంటి లాభం చేకూరలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆరోపించారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత కొండూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని..

మిగతా 2లో..



# కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలి..

- కేటీఆర్ వ్యాఖ్యలపై కోమటిరెడ్డి తీవ్ర ఆగ్రహం
- ఫామ్‌హౌస్‌లు, భూములపై సంచలన ఆరోపణలు
- డ్రగ్స్ దందాపైనా మంత్రి కీలక వ్యాఖ్యలు
- ఉపఎన్నికలకు భయపడేది లేదన్న కోమటిరెడ్డి

**హైదరాబాద్, (డీడీ9 వార్త):** మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వాకిటి శ్రీహరి పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. నియోజకవర్గ పరిధిలోని పలు ప్రధాన రహదారులు, వంతెనల నిర్మాణాలకు సంబంధించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన

మిగతా 2లో..



# నిజాం ఆస్తుల కంటే కేసీఆర్ ఆస్తులే ఎక్కువ

- అంత భూమి ఎక్కడి నుంచి వచ్చింది
- కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్న
- అజీజ్‌నగర్‌లో కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల పర్యటన
- మూడోరోజు కొనసాగిన క్షేత్రస్థాయి పరిశీలన
- కేటీఆర్ ఆస్తులపై చామల ప్రశ్నలు
- హరీశ్‌రావు ఫామ్‌హౌస్‌పైనా ఆరోపణలు

**హైదరాబాద్, (డీడీ9 వార్త):** మాజీ సీఎం కేసీఆర్ కుటుంబానికి ఉన్న ఆస్తులు నిజాం ఆస్తుల కంటే ఎక్కువని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఆ ఆస్తులు ఎలా వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. మూడోరోజు క్షేత్రస్థాయి భూముల పరిశీలనలో భాగంగా అజీజ్‌నగర్‌లో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు పర్యటించారు. ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో ఈ పర్యటన జరిగింది. అనంతరం చామల మీడియాతో మాట్లాడారు.

**ఆస్తులపై చామల ప్రశ్నలు**

ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలనే ఉద్దేశంతోనే భూముల పరిశీలన చేపట్టినట్లు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. 2009లో కేటీఆర్‌కు

మిగతా 2 లో..



# వ్యవస్థ విద్యార్థుల ప్రశ్నలకు భయపడుతోంది

**మొదటిపేజీ తరువాయి**

వ్యవస్థ విద్యార్థుల ప్రశ్నలకు భయపడు తోంది
మీడియా తదితర రంగాలు 'వ్యవస్థ' ప్రభావంలో ఉన్నాయని ఆయన ఆరోపించారు. విద్యా రంగంపై కూడా రాహుల్ మాట్లాడారు. దేశంలో 10 లక్షల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, గత పదేళ్లలో సుమారు లక్ష పాఠశాలలు మూతపడ్డాయని ఆయన పేర్కొన్నారు. 2014లో విద్యకు బడ్జెట్‌లో 4.6 శాతం కేటాయిస్తే ప్రస్తుతం 2.6 శాతానికి తగ్గిందని ఆరోపించారు. ఈ గణాంకాలను రాహుల్ తన ప్రసంగంలో ప్రస్తావించినట్లు పలు వార్తా సంస్థలు పేర్కొన్నాయి.

విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా కార్యక్రమంలో ప్రస్తావించారు. ఉద్యోగ నియామకాల్లో జాప్యం, పరీక్షల్లో అవకతవకలు, ఖాళీ పోస్టులు, హాస్టళ్ల కొరత తదితర అంశాలను విద్యార్థులు రాహుల్ దృష్టికి తీసుకెళ్లారు. విద్య ప్రతి విద్యార్థి హక్కు అని, అది ప్రభుత్వాలు అందించాల్సిన బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. :

ఇదిలా ఉండగా, రాహుల్ ఆరోపణలపై మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్ స్పందించారు. విద్య, విద్యార్థుల అంశాలపై మాట్లాడేటప్పుడు రాహుల్ వాస్తవాలు, గణాంకాలను ప్రస్తావించాల్సిందని అన్నారు.

# కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలి..

**మొదటిపేజీ తరువాయి**

బహిరంగ సభలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రసంగిస్తూ, బిఆర్ఎస్ నాయకులు, ముఖ్యంగా కేటీఆర్ వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

**ఫామ్‌హౌస్‌లు,**
**డ్రగ్స్ దందాపై తీవ్ర ఆరోపణలు**

కేటీఆర్ నోరు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని, లేకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని మంత్రి కోమటిరెడ్డి హెచ్చరించారు. ప్రజల సొమ్మును దోచుకుని వందల ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు కడితే చూస్తూ ఊరుకోవాలా అని ప్రశ్నించారు. అసైన్డ్ భూములు, లావుణి పట్టా భూములతో పాటు 111 జీవో పరిధిలోని స్థలాల్లో డ్రగ్స్ దందా సాగిస్తుంటే ఊరుకునే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. అక్రమంగా కొల్లగొట్టిన ప్రభుత్వ భూములను తిరిగి రికవరీ చేసి తీరాలని స్పష్టం చేశారు. గతంలో ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ తీసుకుంటూ కేటీఆర్ బావమరిది పట్టుబడిన ఉదంతాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

**పశువుల్లా కొనుగోలు చేశారు..**
**ఉపఎన్నికలకు భయం లేదు!**

తాను ఆరుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించినప్పటికీ తనకు ఎలాంటి ఫామ్‌హౌస్ లేదని మంత్రి తెలిపారు. గతంలో కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు 13 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను సంతలో పశువుల్లా కొనుగోలు చేశారని మండిపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితిని అడ్డం పెట్టుకుని బిఆర్ఎస్ నాయకులు నీచ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉపఎన్నికలు అంటే ఎలాంటి భయం లేదని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.

# వర్ధమాన దేశాలపై నిందలేస్తారా?

**మొదటిపేజీ తరువాయి**

ప్రారంభించారు. పారిస్ ఒప్పందం నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువుకంటే ముందే చేరుకున్న ఏకైక జీ20 దేశం భారత్ అని వివరించారు.

**ప్రపంచ వేదికలపై భారత్ వాదన**

వాతావరణ మార్పుల అంశంపై భారత్ తన వాదనను ప్రపంచ వేదికలపై గట్టిగా వినిపిస్తోందని మోదీ అన్నారు. తలసరి కర్బన ఉద్గారాల్లో భారత్ వాటా చారిత్రకంగా చాలా తక్కువగా ఉందని పేర్కొన్నారు. అయినప్పటికీ వాతావరణ మార్పులకు వర్ధమాన దేశాలదే బాధ్యత అన్నట్లుగా నిందించడం సరికాదని స్పష్టం చేశారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన "ది ఫ్యూచర్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ క్లైమేట్ డైనమిక్స్" అంతర్జాతీయ సదస్సు ప్రారంభోత్సవంలో. ఈ సదస్సును జాతీయ హరిత ట్రైబ్యునల్ నిర్వహించింది. మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని కొత్తగా నియమితులైన యువతను ఉద్దేశించి ప్రసంగించారు

**పారిస్ లక్ష్యాల్లో ముందంజ**

వాతావరణ మార్పుల నియంత్రణలో అంతర్జాతీయ ఒప్పందాలకు భారత్ కట్టుబడి ఉందని మోదీ తెలిపారు. పారిస్ ఒప్పందం నిర్దేశించిన లక్ష్యాలను గడువుకు ముందే సాధించిన ఏకైక జీ20 దేశం భారత్ అని చెప్పారు. అభివృద్ధి చెందుతున్న దేశాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వాతావరణ విధానాలు ఉండాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు.

**అభివృద్ధి–పర్యావరణ సమతుల్యత**

అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండూ సామరస్యంగా ముందుకు సాగాలని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఈ రెండింటి మధ్య సమతుల్యత ఎలా సాధించాలనేదే ప్రస్తుతం న్యాయస్థానాల ముందున్న ప్రశ్నగా పేర్కొన్నారు. పర్యావరణ న్యాయాన్ని కాపాడేందుకు సుప్రీంకోర్టు మర్రిచెట్టులా నిలుస్తోందని వ్యాఖ్యానించారు.

**యువతకు ఉపాధిపై దృష్టి**

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంచేందుకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నిస్తోందని మోదీ చెప్పారు. వివిధ దేశాలతో కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు ఇందుకు దోహదం చేస్తాయని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలతో యువతకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని వివరించారు.

**రూ.లక్ష కోట్ల ప్రోత్సాహకాలు**

రూ.లక్ష కోట్ల ఉపాధి ప్రోత్సాహక పథకాల ద్వారా 2 కోట్ల మంది యువతీయువకులు సంఘటిత కార్మికశక్తిలోకి రానున్నారని మోదీ తెలిపారు. ఉద్యోగాల కల్పనతోపాటు యువత నైపుణ్యాలను పెంచడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పారు.

**51 వేలకుపైగా నియామకాలు**

దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో శనివారం 20వ రోజ్‌గార్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా 51 వేలకుపైగా నియామక పత్రాలను పంపిణీ చేశారు. నియామక పత్రాలు అందుకున్న వారిని ఉద్దేశించి మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. ఉద్యోగ అవకాశాలను పెంచేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు.

# ఖైరతాబాద్‌లో కాంగ్రెస్‌కు రాజకీయ నిమజ్జనం

- కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్య
- కాంగ్రెస్‌కు పోటీ చేసే సత్తా లేదంటూ ఎద్దేవా
- దానం నాగేందర్ వ్యాఖ్యలపై స్పందన
- 'వినాయకుడితో పోల్చుకోవడం సరికాదు'
- నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్ష
- కాంగ్రెస్ ఫాంహౌస్ పర్యటన ఓ జోక్
- ప్రైవేటు భూముల్లోకి వెళ్లే అధికారం ఎక్కడిదని ప్రశ్న
- కరీంనగర్‌లో మీడియాతో బండి సంజయ్ వ్యాఖ్యలు




ఖైరతాబాద్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు రాజకీయ నిమజ్జనం తప్పదని కేంద్ర మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ కుమార్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ తమకు పోటీ కాదని, ఉప ఎన్నికను ఎదుర్కొనే సత్తా ఆ పార్టీకి లేదని వ్యాఖ్యానించారు. ఆదివారం కరీంనగర్‌లో పర్యటించిన బండి సంజయ్ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

ఖైరతాబాద్ ఉప ఎన్నిక నేపథ్యంలో కాంగ్రెస్‌పై బండి సంజయ్ విమర్శలు చేశారు. దానం నాగేందర్ తనను తాను వినాయకుడితో పోల్చుకోవడం సరికాదని అన్నారు. వినాయకుడిని చివర్లో నిమజ్జనం చేస్తారనే విషయం దానం నాగేందర్‌కు తెలియదా? అని ప్రశ్నించారు. అదే సమయంలో దానం నాగేందర్ నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు.

ఖైరతాబాద్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను ఎదుర్కొనేందుకు బీజేపీ సిద్ధంగా ఉందని బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్ తమకు పోటీనే కాదని వ్యాఖ్యానించారు. ఉప ఎన్నికను ఎదుర్కొనే సత్తా కాంగ్రెస్‌కు లేదని విమర్శించారు.

కాంగ్రెస్ నేతలు చేపట్టిన ఫాంహౌస్ పర్యటనలపైనా బండి సంజయ్ స్పందించారు. కాంగ్రెస్ నేతల ఫాంహౌస్ సందర్శన ఓ జోక్‌లా ఉందని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. కేసీఆర్ కుటుంబానికి చెందిన ఫాంహౌస్‌లు ఏమైనా పర్యాటక కేంద్రాలా? అని ప్రశ్నించారు.

ప్రైవేటు భూముల్లోకి వెళ్లేందుకు కాంగ్రెస్ నేతలకు అధికారం ఎక్కడిదని బండి సంజయ్ నిలదీశారు. రాజకీయ విమర్శలు, ఫాంహౌస్ పర్యటనలపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

# వారం రోజులు భారీ వర్షాలు

**మొదటిపేజీ తరువాయి**

అయింది. మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలు కూడా అప్రమత్తత జాబితాలో ఉన్నాయి. రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు హెచ్చరికలు జారీ చేశారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలకు కూడా ఎల్లో అలెర్ట్ ఇచ్చారు.

**సోమవారం భారీ వర్షా లు**

సోమవారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట జిల్లాల్లో వర్షాలు పడే సూచనలు ఉన్నాయని పేర్కొన్నారు. రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లోనూ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోనూ వర్ష ప్రభావం ఉండనుందని తెలిపారు.

**అల్పపీడనం బలోపేతం**

ప్రస్తుతం ఉత్తర అండమాన్ సముద్రం, దానికి ఆనుకుని ఉన్న తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోంది. ఇది పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ మరింత బలపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. సెప్టెంబర్ 21న వాయుగుండంగా మారే సూచనలు ఉన్నాయని వెల్లడించింది. 22న తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని పేర్కొంది.

**ఏపీ, తెలంగాణపై ప్రభావం**

సెప్టెంబర్ 23 ఉదయం నాటికి అల్పపీడనం దక్షిణ ఒడిశా-ఉత్తర ఆంధ్రప్రదేశ్ తీరాలకు సమీపంలోని పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతానికి చేరుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో సెప్టెంబర్ 20 నుంచి 25 వరకు తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.



# రాహుల్ మిమిక్రీపై ఫడ్నవీస్ సెటైర్లు

- ఇండోర్ 'ఛాత్రోంకీ గూంజ్'లో వివాదాస్పద ఘటన
- మోదీని అనుకరించిన కమెడియన్ పుల్కిత్ మణి
- రాహుల్ సమక్షంలో మిమిక్రీపై బీజేపీ అభ్యంతరం
- స్టాండ్‌అప్ కమెడియన్‌గా మారితే ఉద్యోగమంటూ ఫడణవీస్
- కాంగ్రెస్‌ను నిరుద్యోగ పార్టీగా మార్చారంటూ ఎద్దేవా
- రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ నేతల విమర్శలు
- మిమిక్రీపై కాంగ్రెస్ నేత రషీద్ అల్వీ సమర్థన
- సాధారణ మిమిక్రీలో తప్పేమీ లేదన్న కాంగ్రెస్ నేత
- ఇండోర్ వేదికగా మొదలైన రాజకీయ వివాదం
- మిమిక్రీపై అధికార, విపక్ష నేతల భిన్న వాదనలు



**ఢిల్లీ, (డీడీ9 వార్త):**

ఇండోర్‌లో జరిగిన 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీని అనుకరిస్తూ జరిగిన మిమిక్రీపై రాజకీయ వివాదం చెలరేగింది. ఈ ఘటనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ స్పందించారు. రాహుల్ గాంధీ స్టాండ్‌అప్ కమెడియన్‌గా మారితే మంచి ఉపాధి లభిస్తుందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీని ఇప్పటికే నిరుద్యోగంగా మార్చేశారని వ్యాఖ్యానించారు. ముంబయిలో ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

**ఇండోర్‌లో ఏం జరిగింది?**

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో సెప్టెంబర్ 19న 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమం జరిగింది. విద్యార్థులు, యువతతో రాహుల్ గాంధీ నిర్వహించిన ఈ కార్యక్రమంలో కమెడియన్ పుల్కిత్ మణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని మోదీ హావభావాలు, మాట్లాడే తీరును అనుకరించారు. రాహుల్ గాంధీ వేదికపై ఉండగా ఈ ప్రదర్శన జరగడంతో వివాదం మొదలైంది.

**ఫడణవీస్ వ్యాఖ్యలు**

ముంబయిలో మీడియాతో మాట్లాడిన ఫడణవీస్.. రాహుల్ గాంధీకి రాజకీయాల్లో మిగిలిన ఏకైక పని ఇదేనంటూ వ్యాఖ్యానించారు. స్టాండ్‌అప్ కమెడియన్‌గా మిమిక్రీ చేస్తే మంచి ఉద్యోగం లభిస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీని ఇప్పటికే నిరుద్యోగంగా మార్చేశారని ఎద్దేవా చేశారు.

**బీజేపీ నేతల విమర్శలు**

మిమిక్రీ ఘటనపై బీజేపీ నేతలు రాహుల్ గాంధీపై విమర్శలు చేశారు. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు కూడా స్పందించారు. కాంగ్రెస్ కార్యక్రమంలో ప్రధాని మోదీని అనుకరించడం, దానిపై రాహుల్ స్పందించిన తీరును బీజేపీ నేతలు తప్పుబట్టారు. ఈ ప్రదర్శన ప్రధాని మోదీతోపాటు ఆయన తల్లిని అవమానించేలా ఉందని కొందరు బీజేపీ నేతలు ఆరోపించారు.

**కాంగ్రెస్ నుంచి సమర్థన**

కాంగ్రెస్ నేత రషీద్ అల్వీ రాహుల్ గాంధీకి మద్దతుగా మాట్లాడారు. అది సాధారణ మిమిక్రీ మాత్రమేనని, అందులో అభ్యంతరకరమైనది ఏమీ లేదని అన్నారు. కార్యక్రమంలో మహిళలు, ప్రజలు నవ్వుకున్నారని పేర్కొన్నారు. మిమిక్రీని రాజకీయ వివాదంగా మార్చడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు.

**విద్యార్థుల సమస్యలపై కార్యక్రమం**

'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమంలో విద్యార్థుల సమస్యలు, విద్య, ఉద్యోగాలు, పోటీ పరీక్షలు తదితర అంశాలపై రాహుల్ గాంధీ మాట్లాడారు. దేశంలోని విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై తమ అభిప్రాయాలను వెల్లడించే వేదికగా ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నిర్వహించింది.

# ధరణి పేరుతో పేద రైతులకు తీవ్ర అన్యాయం

- ధరణితో పేద రైతులు నష్టపోయారన్న ఈటల
- కాస్తు, అనుభవదారి కాలమ్స్ తొలగింపుపై అభ్యంతరం
- పాత భూ రికార్డులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని వ్యాఖ్య
- భూ భారతి నేపథ్యంలో మళ్లీ తెరపైకి భూ హక్కుల అంశం

**హైదరాబాద్, (డీడీ9 వార్త):**

తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ వల్ల పేద రైతులు తీవ్రంగా నష్టపోయారని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. ఎన్టీవీతో మాట్లాడిన ఆయన.. ధరణి పోర్టల్ తీసుకొచ్చిన సమయంలో భూ రికార్డుల నిర్వహణ మరింత సులభతరం అవుతుందని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కూడా ప్రయోజనం కలుగుతుందని ప్రభుత్వం చెప్పిందని గుర్తుచేశారు. అయితే ఆచరణలో మాత్రం అనేక మంది పేద రైతులు తమ భూములకు సంబంధించిన హక్కులు, రికార్డుల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆయన పేర్కొన్నారు.

ధరణి పోర్టల్‌లో భూమిపై ఎవరు హక్కుదారులో, ఎవరు ఆ భూమిని సాగు చేస్తున్నారో తెలియజేసే 'కాస్తు', 'అనుభవదారి' కాలమ్స్‌ను తొలగించడం వల్ల అసలైన సాగుదారులకు సమస్యలు ఏర్పడ్డాయని ఈటల రాజేందర్ అన్నారు. తరతరాలుగా ఒకే భూమిని సాగు చేసుకుంటున్న పేద రైతుల వద్ద సరైన సేల్ డీడ్లు లేకపోవడంతో ఇప్పుడు తమ హక్కులను నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన వివరించారు. రికార్డుల్లో మార్పులు రావడం, పాత వివరాలు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో అనేక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆరోపించారు.

దొరల వద్ద ఎట్టి చాకిరీ చేసిన కుటుంబాలు, వారి నుంచి తక్కువ ధరకు భూములను కొనుగోలు చేసి ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న వారు కూడా ఇప్పుడు సమస్యలను ఎదుర్కొంటున్నారని ఈటల తెలిపారు. తాము సాగు చేస్తున్న భూమిపై పూర్తి స్థాయి హక్కు ఉన్నప్పటికీ, దానికి సంబంధించిన పత్రాలు లేకపోవడం వల్ల పేద రైతులు తమ భూములను కాపాడుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. మరోవైపు దేవాలయ భూముల విషయంలోనూ అక్రమాలు జరిగాయని, కొందరు వాటిని కబ్జా చేశారని ఈటల ఆరోపించారు.

ధరణి విధానం అమల్లోకి వచ్చిన సమయంలోనే ప్రజలకు ఎదురయ్యే సమస్యలపై తాను ఆందోళన వ్యక్తం చేశానని ఈటల రాజేందర్ తెలిపారు. తాను మంత్రిగా ఉన్న సమయంలోనే ఈ విధానం వల్ల పేద రైతులకు నష్టం జరిగే అవకాశం ఉందని భావించానని చెప్పారు. భూమి అనేది పేద రైతులకు కేవలం ఆస్తి మాత్రమే కాదని, తరతరాలుగా వారి జీవనాధారంగా కొనసాగుతున్న భూమిపై రికార్డుల సమస్యలు తలెత్తితే వారి కుటుంబాలే తీవ్రంగా ప్రభావితమవుతాయని ఆయన పేర్కొన్నారు.

ధరణి పోర్టల్ స్థానంలో ప్రస్తుతం భూ భారతి వ్యవస్థ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో రాష్ట్రంలో భూ సమస్యలు మరోసారి చర్చకు వస్తున్నాయి. ధరణి కారణంగా ఏర్పడిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు ఇప్పటికే వెల్లడించింది. ఈ క్రమంలో పేద రైతుల భూ హక్కులు, పాత రెవెన్యూ రికార్డులు, సాగుదారుల వివరాలు వంటి అంశాలపై ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# కాంగ్రెస్ పాలనతో ఎవరికీ లాభం లేదు

**మొదటిపేజీ తరువాయి**




ఇప్పటివరకు ఎవరికైనా ఆ మొత్తం అందించారా? అని ప్రశ్నించారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని.. ఆ హామీ ఏమైందని నిలదీశారు. ఉద్యోగాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అంశాలపై హరీశ్‌రావు గతంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు.

రేవంత్‌రెడ్డికి, ఆయన కుటుంబ సభ్యులు, సన్నిహితులకు ఉద్యోగాలు వచ్చాయి తప్ప సాధారణ యువతకు ఎలాంటి ప్రయోజనం కలగలేదని హరీశ్‌రావు ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కూడా ప్రభుత్వం నిలిపివేసిందని విమర్శించారు. విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశంపై హరీశ్‌రావు ఇటీవల కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క కాల్వ కూడా తవ్వలేదని హరీశ్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు దెబ్బతిన్నాయని విమర్శించారు. ప్రభుత్వ హామీల అమలుపై బీఆర్ఎస్ ఇప్పటికే చార్జిషీట్ విడుదల చేసి పలు అంశాలను ప్రస్తావించిన విషయం తెలిసిందే.

కాంగ్రెస్ నేతలు చేస్తున్న భూకబ్జాలపై మాట్లాడినందుకే తమపై దాడులు చేశారని హరీశ్‌రావు ఆరోపించారు. తమ ఆస్తులు, కాంగ్రెస్ నేతల ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా? అని సవాల్ చేశారు. ఆరోపణలపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం బీఆర్ఎస్ ఎంపీలు ఢిల్లీలో పోరాడాలని హరీశ్‌రావు సూచించారు. కేవలం యాత్రలు చేయడం వల్ల ప్రయోజనం ఉండదని, రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని అన్నారు. కాంగ్రెస్ నేతలు చేపడుతున్న యాత్రలను ఉద్దేశిస్తూ.. "మీ యాత్రలు రేవంత్‌రెడ్డి ఇంటికి చేయండి" అని వ్యాఖ్యానించారు.

# నిజాం ఆస్తుల కంటే కేసీఆర్ ఆస్తులే ఎక్కువ

**మొదటిపేజీ తరువాయి**

లేని ఆస్తులు ఇప్పుడు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఉద్యమ సమయంలో హరీశ్‌రావుకు లేని ఫామ్‌హౌస్ ఇప్పుడు ఎలా వచ్చిందని నిలదీశారు.

**అసైన్డ్ భూములపై ఆరోపణలు**

కేసీఆర్ ఫామ్‌హౌస్ పక్కన ఉన్న 300 ఎకరాల అసైన్డ్ భూములనూ చామల ప్రస్తావించారు. ఆ భూములను దళితులకు ఎందుకు పంచలేదని ప్రశ్నించారు. ఆ భూమిని కబ్జా చేసేందుకు కేసీఆర్ ప్రయత్నించారని ఆరోపించారు.

**క్షేత్రస్థాయి పరిశీలన**

అజీజ్‌నగర్‌లో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు భూములను పరిశీలించారు. ప్రజలకు వాస్తవ పరిస్థితులను వివరించేందుకే ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. భూములకు సంబంధించిన అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని వెల్లడించారు.

## బీఎండబ్ల్యూ కారు బోల్తా..

# ముగ్గురు మృతి

- కోస్టల్ రోడ్ బ్రిడ్జ్ పై నుంచి జారిపడ్డ కారు
- తెల్లవారుజామున ముంబయిలో ఘోర ప్రమాదం
- మెరైన్ డ్రైవ్ నుంచి హాజీ అలీ వైపు ప్రయాణం
- ప్రమాద సమయంలో కారులో నలుగురు
- అతివేగమే కారణమా? పోలీసుల దర్యాప్తు

**ముంబయి, (డీడీ9 వార్త):**

ముంబయిలోని కోస్టల్ రోడ్ బ్రిడ్జిపై ఆదివారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం జరిగింది. మెరైన్ డ్రైవ్ నుంచి హాజీ అలీ వైపు వెళ్తున్న బీఎండబ్ల్యూ కారు అదుపుతప్పి వంతెనపై నుంచి కిందపడింది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఒకరిని షన్యా గజ్జల్ (21)గా గుర్తించారు. కారు మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్న సమయంలో అదుపు తప్పినట్లు సమాచారం. వంతెనపై అదుపు కోల్పోయిన కారు కింద పడటంతో తీవ్రంగా ధ్వంసమైంది. ప్రమాద తీవ్రతకు కారులో ఉన్న ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు.

**ముగ్గురి మృతి**

ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందుకున్న అధికారులు ఘటనాస్థలికి చేరుకున్నారు. కారులో ఉన్న ముగ్గురూ అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుల్లో షన్యా గజ్జల్ ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ ప్రమాదంలో మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. అతడిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ఘటనకు సంబంధించిన వివరాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.





## పర్ణశాల వద్ద గోదావరి నదిలో వినాయక నిమజ్జనాలకు అనుమతులు మంజూరు

**సెప్టెంబర్ 20 డిడి 9 వార్త దుమ్ముగూడెం**

దుమ్ముగూడెం మండలం పర్ణశాలలో వినాయక నిమజ్జనాల విషయంలో గత నాలుగు రోజుల నుండి జరుగుతున్న పరిణామాల మధ్య ఎట్టకే లకు ఆదివారం నాడు ఎమ్మెల్యే తెల్లం వెంకట రావు చొరవతో పర్ణశాల గోదావరి నది తీరంలో వినాయక నిమజ్జవోత్సవానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అనుమతులు మంజూరు చేశారు. అధికారుల సూచనల వరకు గణేష్ కమిటీ సభ్యులు సమన్వయంగా ప్రశాంతంగా గణేష్ నిమజ్జోత్సవం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

## వివిధ మృతుల కుటుంబాలను పరామర్శించిన తెలంగాణ రాష్ట్ర అటవీశాఖ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య

**సెప్టెంబర్ 20 డిడి 9 వార్త దుమ్ముగూడెం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలంలోని ఇటీవల మృతి చెందిన కుటుంబాలను ఆదివారం నాడు తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పోదం వీరయ్య పరామర్శించారు. వివరాల్లోకి వెళితే లక్ష్మీనగరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్ది రాము ఇటీవల ఇసుక లారీ ఢీకొనడంతో మృతి చెందారు వారి కుటుంబాన్ని పరామర్శించి నివాళులర్పించారు. సీతానగరం గ్రామానికి చెందిన టిడిపి దుమ్ముగూడెం మండల అధ్యక్షులు కొమరం దామోదర్ రావు తల్లి స్వరాజమ్మ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని మరియు అదే గ్రామానికి చెందిన నల్ల మల్లికార్జున్ రావు అనారోగ్యంతో ఇటీవల మరణించడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దుమ్ముగూడెం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తెల్ల హరికృష్ణ జిల్లా కార్యదర్శి లంక అబ్బులు వాసిరెడ్డి సాంబశివరావు మండల యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ సిద్ది ప్రవీణ్ మరియు భాగ్య శ్రీధర్ మెట్టుపల్లి నటరాజ్ స్వామి గడ్డం బాలాజీ చల్ల శేఖర్ లంక శివ లంక రాంప్రసాద్ డింకి సందీప్ రెడ్డి లంక సంపత్ కొరసా రాఘవ తదిరదులు పాల్గొన్నారు





## రాజేశ్వరరావు పల్లిలో అన్నదాన కార్యక్రమం

**ములుగు, సెప్టెంబర్ 20, ఆదాబ్ హైదరాబాద్ :**

ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవి పేట గ్రామపంచాయతీ పరిధిలోని రాజేశ్వరరావు పల్లి గ్రామంలో విఘ్నేశ్వర కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించిన అన్నదాతలు గాజర్ల సమ్మయ్య సరోజన, కారుపోతుల యాదగిరి శశిరేఖ, గౌని యాదగిరి లక్ష్మి, పెండ్యాల సలేంద్రం ఇందిరా దేవి, కాసాని శ్రీహరి రాజ్యం, పంజా వేణి సతీష్ స్వరూప, బిక్కినేని సుజాత కిరణ్, చంద్రగిరి రాజయ్య పద్మ, తీగల సంపత్ రావు సమ్మక్క, బాలాజీ సతీష్ అరుణ, ఆశ వర్కర్ సబిత, దయ్యాల యాకయ్య సోమలక్ష్మిలు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు ఉప సర్పంచ్ కొండ తిరుపతి, గాజువేని రమేష్, గాజవేని వనిత, గజవేని రఘు, గణేష్, సుమారు 300 మంది గ్రామ ప్రజలు హాజరయ్యారు.



## రాజేశ్వరరావు పల్లెలో అన్నదాన కార్యక్రమం

**ములుగు, డి డి9 వార్త :**

ములుగు జిల్లా వెంకటాపురం మండలం లక్ష్మీదేవి పేట గ్రామపంచాయతీ పరిధి లోని రాజేశ్వరరావు పల్లి గ్రామంలో విఙ్ణేశ్వర కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన ప్రముఖులు గాజర్ల సమ్మయ్య సరోజన, పెండ్యాల సలేంద్రం ఇందిరా దేవి, కారు పోతుల యాదగిరి శశిరేఖ, కాసాని శ్రీహరి రాజ్యం, తీగల సమ్మక్క సంపత్ రావు, చంద్రగిరి రాజయ్య పద్మ, పంజావేని సతీష్ స్వరూప, బిక్కినేని సుజాత కిరణ్, ఆశ వర్కర్ సవిత, దయ్యాల యాకయ్య సోమలక్ష్మి, బాలాజీ సతీష్ అరుణ లు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కాగా ఈ కార్యక్రమాన్ని గాజర్ల చరణ్, పంచవేని రాజేష్ లు ఆర్గనైజ్ చేశారు.



# అశ్వారావుపేట BRS పార్టీ నాయకులు... మండలంలో పర్యటన

- **వినాయకపురం దళిత విద్యార్థి మణిదీప్ కి ఘన సన్మానం**
- **ఉచిత ఎంబిబిఎస్ సీటు సాధించిన కోయ మణిదిఫ్ విద్యార్థికి అభినందనలు**
- **RSP ప్రవీణ్ కుమార్ మరియు ఎమ్మెల్సీ అభ్యర్థి**
- **రాకేశ్ రెడ్డి తో వీడియో కాల్ లో విద్యార్థికి శుభాకాంక్షలు**

**అశ్వరావుపేట:సెప్టెంబర్ 20(డిడి 9 వార్త)**

అశ్వారావుపేట మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వినాయకపురం గుడ్ సపోర్ట్ ఎవాంజికల్ లూథరన్ చర్చి మందిరంలో దైవికంగా ఒక గొప్ప కార్యక్రమం జరిగింది, ఉచిత ఎంబిబిఎస్ సీటు సాధించిన దళిత విద్యార్థి కోయ మణిదీప్ కు ఘన సన్మానం చేశారు, మొదటగా మండల నాయకులకు వినాయకపురం చర్చి సంఘ సభ్యులు ఘన స్వాగతం పలికారు, మందిరంలో ప్రార్థనలతో కార్యక్రమం ప్రారంభమైంది, అనంతరం నాయకులు విద్యార్థికి శాలువాతో సన్మానం చేసి స్వీటు తినిపించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ ఉదయ జ్యోతి మాట్లాడుతూ... దేవుని దయ వల్ల, తల్లిదండ్రుల కష్టం వల్ల నేడు ఈ విద్యార్థి ఈ ఉన్నత స్థాయికి చేరాడని, ఇది మన గ్రామానికి , మన మండలానికి గర్వ కారణమని, ఇలాంటి విద్యార్థులు మరెందరో రావాలని ఆకాంక్షించారు.

కాసాని చంద్రమోహన్ మాట్లాడుతూ...
పేదరికం చదువుకు అడ్డు కాదని, దళిత బిడ్డలు కూడా కష్టపడితే వైద్యులై సమాజానికి సేవ చేయగలరని, మనిదీప్ ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

జుజ్జూరి శ్రీరామ్ మూర్తి మాట్లాడుతూ..
దేవుణ్ణి కీర్తిస్తూ సాగిన ఈ కార్యక్రమం ఎంతో స్ఫూర్తిదాయకమని, విద్యార్థి తల్లిదండ్రుల ఆశలను నిలబెట్టాలని, భవిష్యత్తులో గొప్ప వైద్యుడిగా ఎదిగి పేద ప్రజలకు సేవ చేయాలని కోరారు.

సత్యవరపు సంపూర్ణ మాట్లాడుతూ...
ఒక దళిత విద్యార్థి ఇంత గొప్ప విజయం సాధించడం దేవుని ఆశీర్వాదమని, తల్లిదండ్రుల త్యాగాన్ని, గురువుల కృషిని మరువరాదని హితవు పలికారు.



అనంతరం విద్యార్థితో ఆర్ఎస్పి ప్రవీణ్ కుమార్ వీడియో కాల్ ద్వారా మాట్లాడి అభినందనలు తెలిపారు, విద్యార్థి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని దీవించారు.

బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డి ఫోన్ ద్వారా మాట్లాడుతూ ఈ విజయం అశ్వారావుపేట మండలానికే గర్వకారణమని, ఇలాంటి ప్రతిభగల విద్యార్థులకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో జక్కుల రాంబాబు మోటూరి మోహన్, ఆరేపల్లి గోవిందం,జక్కుల నాగేశ్వరావు, ఉప్పల ప్రసాద్, కౌలూరి నరేష్, కాటూరి నాగు , ఉప్పల మురళి,తగరం జగన్నాథం, తూంపాటి రమేష్, బంతు శ్రీనివాస్, దైవజనులు బెంజిమెన్, స్థానిక సంఘ సభ్యులు మరియు తదితరులు పాల్గొన్నారు, చివరిగా దేవుని ప్రార్థనతో, విద్యార్థి తల్లిదండ్రుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని, సమాజానికి ఉపయోగపడే గొప్ప వైద్యుడిగా ఎదగాలని అందరూ ఆకాంక్షిస్తూ కార్యక్రమం ముగించారు.

## వరంగల్ ఎయిర్ పోర్టుకి సమ్మక్క సారలమ్మ ఎయిర్ పోర్ట్ గా నామకరణం చేయండి.

- **తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**
- **మీరు వరంగల్ ఎయిర్ పోర్ట్ కి పేరు సూచించమని పత్రికల ద్వారా అడిగారు. అందుకు మా ప్రతిపాదన**

**తాడ్వాయి డిడి9 వార్త**

వనదేవతలకు నిలయమైన ఓరుగల్లు, ఆదివాసీ ప్రజల ఆరాధ్య దైవం కోట్లాది ప్రజల కొంగు బంగారం మేడారం సమ్మక్క సారలమ్మల పేరుతో వరంగల్ ఎయిర్ పోర్ట్ కి నామకరణం చేయమని మా విజ్ఞప్తి ఆసియా ఖండంలోనే అతి పెద్ద వన దేవతల జన జాతర విశ్వ విఖ్యాత గాంచిన వీర నారీ మణులైనా సమ్మక్క సారలమ్మల పేరు పెడితే అద్భుతంగా,గంభీరంగా ఉంటుంది. అందుకే వరంగల్ ఎయిర్పోర్ట్ కి ఈ పేరు ఖాయం చేయమని, తెలంగాణలోని 4కోట్ల మంది ప్రజల అభిప్రాయాన్ని తెలియజేస్తున్నాము. ఒక వేళ సమ్మక్క సారలమ్మ




పేరు మీరు పెట్టలేదంటే ఖచ్చితంగా బడుగు, బలహీన, దళిత, ఆదివాసీ, గిరిజన, అణగారిన వర్గాలకు వ్యతిరేకమని నిరూపణ అవుతుందనీ మీము భావించాల్సివస్తుంది.



## ప్రముఖ వ్యాపార వేత్త మహమ్మద్ సేట్ మృతికి సంతాపం..

- **కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.**

**మణుగూరు. సెప్టెంబర్ 20(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త మహమ్మద్ సేట్ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మహమ్మద్ సేట్ మృతి పట్ల ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, వారికి తన ప్రగాఢ సానుభూతి ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు కురం రవి ముదిరాజ్, జిల్లా ముఖ్య నాయకులు దొబ్బల వెంకటప్పయ్య, శివ సైదులు, జీవి, రాష్ట్ర నాయకులు సామా శ్రీనివాసరెడ్డి, మైనారిటీ అధ్యక్షులు రహీం పాషా, సర్పంచులు కలబోయిన మాధవరావు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## లబ్ధిదారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం...

- **రూ.6 లక్షల 80 వేల రూపాయల విలువైన CMRF చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.**

**మణుగూరు. సెప్టెంబర్ 20(డి డి 9వార్త)**

పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు లబ్ధిదారులకు అందజేశారు.

మణుగూరు మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం నాడు నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం రూ.6 లక్షల 80 వేల రూపాయల విలువైన CMRF చెక్కులను మణుగూరు మండలానికి చెందిన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనారోగ్యంతో వైద్య చికిత్స పొందుతున్న కుటుంబాలకు CMRF ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినాకి నవీన్, ముఖ్య నాయకులు పాతూరి వెంకన్న, అబ్దుల్లా, అప్పారావు, తిరుమలేష్, చింతల కృష్ణ, మహబూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.



## శివపార్వతి యూత్ ఆధ్వర్యంలో మహా అన్నదానం

**బోనకల్,సెప్టెంబర్ 20,(డీడీ9 వార్త):**

బోనకల్ గ్రామంలోని విశాలాక్షి కిరాణం సమీపంలో శివపార్వతి యూత్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వినాయక నవరాత్రుల సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బోనకల్ గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి,ఉప సర్పంచ్ బానోతు కొండ హాజరై గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వినాయక నవరాత్రులను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ, భక్తులకు అన్నదానం చేయడం ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు. భక్తులకు అన్నం పెట్టడం గొప్ప సేవా కార్యక్రమమని, శివపార్వతి యూత్ సభ్యులు ఐక్యంగా ముందుకు వచ్చి అన్నదానం నిర్వహించడం అభినందనీయమని తెలిపారు.

అన్నదాన కార్యక్రమంలో భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. వినాయకుడి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

అలాగే పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఇకనుంచి మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యూత్ సభ్యులకు సూచించారు. భక్తితో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సహకార సంఘం మాజీ అధ్యక్షులు గుండపనేని సుధాకర్ రావు, మాజీ ఎంపీటీసీ గుగులోతు రమేష్, శివపార్వతి యూత్ సభ్యులు ముక్కాని కిషోర్, ముక్కని బుజ్జి, మరీదు శివకృష్ణ, మల్లెల వెంకటకృష్ణ, మీరా మేస్త్రి, షేక్ పెద్ద మీరా, నర్రెడ్ల వెంకటి, షేక్ నాగుల్ మీరా, జంపాల సాంబ, జంపాల నరసింహారావు, బాదావత్ కాంగ్ తదితరులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.





## 16 మంది లబ్ధిదారులకు రూ.4.60 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

**బోనకల్, సెప్టెంబర్20,(డీడీ9 వార్త):**

ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మండలానికి చెందిన 16 మంది లబ్ధిదారులకు ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామరెడ్డి సిఫారసుతో మంజూరైన రూ.4,60,000/ల చెక్కులను ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి,పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు.ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు ఎంతో ఊరటనిచ్చే పథకమని, అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలుస్తోందని తెలిపారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు తమ అవసరాన్ని గుర్తించి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం మంజూరు చేయడానికి సహకరించిన ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సూడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్,గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు,జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్,టెలికాం అడ్వైజర్ కమిటీ డైరెక్టర్ ఉమ్మినేని కృష్ణ,స్థానిక గ్రామ నాయకులు గొడుగు క్రిష్ణ, లబ్ధిదారులు పాల్గొన్నారు.








# అడవిలో ఆశ్రమం.. ఆదివాసీలకు ఆశాకిరణం..!

- **బయక్కపేట ఆశ్రమ పాఠశాల అభివృద్ధికి ప్రగతి బాటలు**
- **ఐటీడీఏ నిధులతో అభివృద్ధి పనులు.. పూర్తిచేసిన సర్పంచ్ గోవర్ధన్**
- **విద్యార్థులకు పౌష్టికాహారం.. మెరుగైన విద్యాబోధనకు ఉపాధ్యాయుల కృషి**
- **పాఠశాలను సందర్శించి అభివృద్ధి పనులను ప్రశంసించిన ఐటీడీఏ డీడీ**

**ఏటూరునాగారం క్రైం, డీడీ 9 వార్త, :**

ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని దట్టమైన అడవుల్లో ఉన్న బయక్కపేట గిరిజన ఆశ్రమ పాఠశాల అభివృద్ధి బాటలో ముందుకు సాగుతోంది.మారుమూల ప్రాంతంలో ఉన్నప్పటికీ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ఐటీడీఏ ఆధ్వర్యంలో నిధులు మంజూరు చేసి పలు అభివృద్ధి పనులు చేపట్టారు.

**అభివృద్ధి పనులతో కొత్త రూపు...**

ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పైకప్పు మరమ్మతు పనులు చేపట్టారు.పాఠశాల గోడలకు రంగులు వేశారు.కూలిపోయిన ప్రాంతాల్లో ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టారు. విద్యార్థుల సౌకర్యార్థం మరుగుదొడ్లను కూడా నిర్మించారు. ఐటీడీఏ ద్వారా మంజూరైన నిధులతో చేపట్టిన ఈ పనులు పూర్తికావడంతో పాఠశాలకు కొత్త రూపు వచ్చింది.ఈ అభివృద్ధి పనులను స్థానిక సర్పంచ్ గోవర్ధన్ ప్రత్యేక శ్రద్ధతో చేపట్టి పూర్తి చేయించారని స్థానికులు పేర్కొంటున్నారు.

**పౌష్టికాహారంతో విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ.....**

విద్యార్థులకు నాణ్యమైన కూరగాయలు,పాలు,కోడిగుడ్లు, చికెన్‌తో పాటు రుచికరమైన వంటకాలను అందిస్తూపౌష్టికాహారం సమకూరుస్తున్నారు.విద్యార్థులు ఆరోగ్యంగా ఎదగడానికి వార్డెన్ చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు పేర్కొంటున్నారు.

**ఉపాధ్యాయుల అంకితభావంతో మెరుగైన విద్య..**

మారుమూల అటవీ ప్రాంతంలో ఉన్న ఈ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వహిస్తున్నారు. రహదారులకు దగ్గరగా ఉన్న పాఠశాలల్లో పనిచేసే కొందరు ఉపాధ్యాయులు ప్రతిరోజూ రాకపోకలు సాగిస్తున్నప్పటికీ, బయక్కపేట ఆశ్రమ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు విద్యార్థులతోనే ఉంటూ వారికి విద్యాబోధన అందిస్తున్నారు. ఉపాధ్యాయుల కృషితో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందుతున్నదని,అడవిలో ఉన్న ఈ పాఠశాల విద్యార్థులకు ఆశాకిరణంగా నిలుస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**పాఠశాలను సందర్శించిన ఐటీడీఏ డీడీ...**

బయక్కపేట ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ డీడీ సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు. పాఠశాలలో కల్పించిన వసతులు, చేపట్టిన అభివృద్ధి పనులను చూసి ప్రశంసించారు.మారుమూల అటవీ ప్రాంతంలోనూ అంకితభావంతో పాఠశాలను నిర్వహిస్తూ విద్యార్థులకు మెరుగైన వసతులు,పౌష్టికాహారం, విద్యాబోధన అందించడం అభినందనీయమని తెలిపారు. అడవిలో ఇంత చక్కగా ఆశ్రమ పాఠశాల కొనసాగుతుండటం విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. అటవీ ప్రాంతంలో విద్యార్థులకు విద్యతో పాటు ఆరోగ్యం,వసతులు కల్పిస్తూ బయక్కపేట ఆశ్రమ పాఠశాల అభివృద్ధి దిశగా ముందుకు సాగడం ఆదివాసీ విద్యార్థులకు నిజమైన ఆశాకిరణంగా నిలుస్తోంది.





## ఐదు భారీ వాహనాలు ఢీ.. తప్పిన పెను ప్రమాదం

**భద్రాచలం టౌన్, సెప్టెంబరు 20 (డీ డీ 9 వార్త)**

ఆంధ్ర-తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన భద్రాచలంలోని కూనవరం రోడ్డులో ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఇసుక క్వారీ సమీపంలోని హైవేపై ఒకేసారి ఐదు భారీ వాహనాలు ఢీకొనడంతో వాహనాలు ధ్వంసమయ్యాయి. ప్రమాద తీవ్రతకు వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. అయితే అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ప్రయాణికులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.ఈ మార్గంలో ఇంతకుముందెన్నడూ ఒకేసారి ఐదు భారీ వాహనాలు ఢీకొన్న ఘటన జరగలేదని స్థానికులు చెబుతున్నారు. తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంతో హైవేపై కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.



## చర్లవాసి కొంగురు ప్రదీప్ కు అక్షర కిరీటి బిరుదు

**చర్ల, సెప్టెంబర్ 20 (డిడి 9 వార్త)**

పాల్ రాజ్ ఇంజనీరింగ్ కాలేజీ (ఎటపాక) భద్రాచలం నందు ఆదివారం 176వ శ్రీ శ్రీ కళావేదిక జాతీయ ద్వి శతాధిక కవి సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐటీడీఏ పీవో బి.రాహుల్ ఐఏఎస్, శ్రీ శ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షురాలు జి.ఈశ్వరి భూషణం, జాతీయ ప్రణాళిక అధికారి పార్థసారథి, శ్రీ కళావేదిక ప్రతినిధి జి. వరలక్ష్మి విచ్చేశారు. అత్యంత వైభవంగా జరిగిన ఈ కార్యక్రమానికి సుమారు 200 మందికి పైగా కవులు విచ్చేసి తమ యొక్క కవిత లను వినిపించారు. ఈ కార్యక్రమంలో చర్ల మండలానికి చెందిన కొంగూరు ప్రదీప్ కుమార్ ఆయన వ్రాసిన నా పల్లె కష్టాలు అనే కవితను చదివి వినిపించారు. అనంతరం ప్రదీప్ కు అక్షర కిరీటి బిరుదు తో పాటు జ్ఞాపిక, శాలువాతో భక్త రామదాసు వంశీయులచే ఘనంగా సన్మానం చేశారు. ప్రదీప్ కుమార్ కు అక్షర కిరీటి బిరుదును పొందిన సందర్భంగా చర్ల మండలంలోని కవులు, శ్రేయోభిలాషులు, మిత్రులు హర్షం వ్యక్తం చేశారు.



## భద్రాచలంలో నేత్రపర్వంగా గోదావరి నదీహారతి

**భద్రాచలం టౌన్ సెప్టెంబరు 20 ( డీడీ 9 వార్త)**

భద్రాచలంలోని పవిత్ర గోదావరి నది తీరంలో నదీహారతి కార్యక్రమం నేత్రపర్వంగా సాగింది. ఈ సందర్భంగా పురోహితులు గోదావరి నదికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పసుపు, కుంకుమ సమర్పించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక హారతులు అందజేశారు.తదుపరి పవిత్ర గోదావరి నదికి పంచహారతులు సమర్పించడంతో కార్యక్రమం భక్తిమయ వాతావరణంలో ముగిసింది. నదీహారతిని వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.



## చౌట్‌పల్లిలో కన్నులపండువగా వినాయక పూజలు

- **స్వామివారికి 108 రకాల ప్రసాదాల నైవేద్యం**

**నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 20(డీడీ9 వార్త ) :**

కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి గ్రామంలో ఆధ్యాత్మిక శోభ విలసిల్లుతోంది. గురడి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన గణపతి నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గణనాథునికి 108 రకాల వైవిధ్యభరితమైన ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించి, భక్తిశ్రద్ధలతో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి కమ్మర్‌పల్లి ఎస్.ఐ.సతీష్ ముఖ్య అతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పురోహితులు గంగాప్రసాద్ దీక్షితులు వేద మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా పూజాధికాలను జరిపించారు. వినాయకుడికి నివేదించిన నైవేద్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గురడి రెడ్డి సంఘం అధ్యక్షుడు కొమ్ముల



నాగిరెడ్డి, ఉపాధ్యక్షుడు సదానంద్ రెడ్డి, సంఘ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలు పొంది తీర్థప్రసాదాలు స్వీకరించారు.



## మండలంలో రెండు డీజే లపై కేసులు నమోదు

- **ఎస్సై మాచినేని రవి వెల్లడి**

**బోనకల్,సెప్టెంబర్20,(డీడీ9 వార్త):**

మండలంలో శనివారం రాత్రి జరిగిన వినాయక చవితి నిమజ్జన కార్యక్రమంలో అనుమతులు లేకుండా ఊరేగింపు కార్యక్రమానికి పెట్టిన రెండు డీజేలపై కేసులు నమోదు చేసినట్టు ఎస్సై మాచినేని రవి తెలిపారు. అదేవిధంగా అన్ని వినాయక చవితి కమిటీ సభ్యులకు డీజేలు పెట్టవద్దని నోటీసులు ఇవ్వడం జరిగింది. ఎవరైనా తదుపరి జరగబోవు వినాయక నిమజ్జన ఊరేగింపు కార్యక్రమానికి డీజే లు పెట్టినట్లయితే కమిటీ మరియు డీజే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్న ఎస్సై హెచ్చరించారు.




## తెలుగు భాషా దినోత్సవంలో పాల్గొనే విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

**భద్రాచలం టౌన్, సెప్టెంబర్ 20 ( డీ డీ 9 వార్త)**

తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనే గిరిజన విద్యార్థినీ విద్యార్థుల పట్ల సంబంధిత పాఠశాలల హెచ్ ఎంలు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ సూచించారు. ఈ నెల 22వ తేదీ మంగళవారం భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన భవన్ లో నిర్వహించనున్న తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఖమ్మం జిల్లాలోని 10 గురుకుల పాఠశాలలు, 10 ఆశ్రమ పాఠశాలలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 40 ఆశ్రమ పాఠశాలలకు చెందిన 200 మంది లోపు విద్యార్థినీ విద్యార్థులు గిరిజన భవన్ కు రానున్నారని తెలిపారు. విద్యార్థులు కవితలు, శీర్షికలు, పద్యాలు, ఉపన్యాసాలు, ఒక్క నిమిషం ఉపన్యాసాలు, ఏకపాత్రాభినయం, నాటికలు తదితర కార్యక్రమాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

## గిరిజన దర్బార్, ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరుకావాలి

- **ఐటీడీఏ పీవో బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట**

**భద్రాచలం టౌన్, సెప్టెంబర్ 20 (డీ డీ 9 వార్త)**

భద్రాచలం ఐటీడీఏ, సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సెప్టెంబర్ 21 నిర్వహించనున్న గిరిజన దర్బార్, ప్రజావాణి కార్యక్రమాలకు అన్ని శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు, డివిజన్ అధికారులు సకాలంలో హాజరు కావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు.

గిరిజనులు, ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదులను అందజేయాలని సూచించారు. ప్రజల నుంచి స్వీకరించే ఫిర్యాదులపై సంబంధిత అధికారులు సత్వరమే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అన్ని శాఖలకు చెందిన యూనిట్ అధికారులు, డివిజన్ అధికారులు సోమవారం ఉదయం 10.30 గంటలకు భద్రాచలం ఐటీడీఏ, సబ్ కలెక్టర్ కార్యాలయాల్లోని సమావేశ మందిరాల్లో తప్పనిసరిగా హాజరు కావాలని పీవో, సబ్ కలెక్టర్ ఆదేశించారు.





## హలో ఉద్యమకారుడా 27న చలో యాదగిరిగుట్ట

- **టీయుఆఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్**

**జనగామ సెప్టెంబర్ 20(డిడి 9 వార్త ) బ్యూరో**

: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టీయూఎఫ్) 9వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఈ నెల 27న యాదగిరిగుట్టలో నిర్వహించనున్నట్లు టీయూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ తెలిపారు. జనగామ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం ఉద్యమకారులతో కలిసి వేడుకల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఉద్యమకారులను ఏకతాటిపైకి తీసుకు వచ్చేందుకు టీయూఎఫ్ తొమ్మిదేళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తోందని చీమ శ్రీనివాస్ తెలిపారు. సెప్టెంబర్ 27న జరిగే వేడుకలకు రాజకీయాలకు అతీతంగా ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమానికి హాజరుకావాలని యాదగిరిగుట్ట దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణ నాయక్, తొర్రూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్ రాజులను కలిసి ఆహ్వానించారు. ఉద్యమకారులు తమ వద్ద ఉన్న ఉద్యమ చరిత్ర, ఎఫ్ఐఆర్ కాపీలు, జైలు శిక్షల వివరాలు, అమరుల కుటుంబాల వివరాలకు సంబంధించిన ఆధారాలను సభ వద్ద అందించాలని సూచించారు.కార్యక్రమంలో టీయూఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు జోగు ఆంజనేయులు, నాగరాజు, దయానంద్, జగన్, ఆర్.కే. భూపాల్, మహిళా ప్రతినిధి శ్యామల, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఈగం శ్రీనివాస్, మాజీ జిల్లా అధ్యక్షుడు తిప్పారపు ఆనంద్, నియోజకవర్గ కన్వీనర్ కడింగుల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# ఫేక్ మ్యాట్రిమోనియల్ ముసుగులో సైబర్ మోసం..!

- **పోలీసులమంటూ ఫోన్.. డిజిటల్ అరెస్ట్ పేరుతో బెదిరింపులు**
- **కేసు లేకుండా చేస్తామంటూ రూ.1.05 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు**
- **ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శాయంపేట ఎస్ఐ పరమేశ్వర్ సూచన**

**శాయంపేట,సెప్టెంబర్ 20,డి డి 9వార్త**

ఫేస్‌బుక్‌లో ఫేక్ మ్యాట్రిమోనియల్ ముసుగులో సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తిని మోసగించి రూ.1.05 లక్షలు కాజేసిన ఘటన హన్మకొండ జిల్లా శాయంపేట మండలకేంద్రంలో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే శాయంపేటకు చెందిన కందగట్ల గోపాల్ అనే వ్యక్తిని కొందరు సైబర్ నేరగాళ్లు ఫేస్‌బుక్ ద్వారా సంప్రదించారు.ముందుగా మ్యాట్రిమోనియల్ పరిచయం పేరుతో నమ్మించి,అనంతరం తాము పోలీసులమంటూ ఫోన్ చేసి గోపాల్‌ను భయభ్రాంతులకు గురిచేశారు."నీపై కేసు నమోదైంది.. నిన్ను డిజిటల్ అరెస్టు చేశాం..కేసు లేకుండా చేయాలంటే డబ్బులు పంపించాలి"అంటూ సైబర్ నేరగాళ్లు బెదిరించారు.వారి మాటలను నమ్మిన గోపాల్ వివిధ దఫాల్లో మొత్తం రూ.1,05,000 నగదును సైబర్ నేరగాళ్లు సూచించిన విధంగా పంపించాడు.అనంతరం తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

**పోలీసుల పేరుతో బెదిరింపులకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి...**

ఈ ఘటనపై శాయంపేట ఎస్ఐ పరమేశ్వర్ మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తులు పోలీసులమని,ఇతర ప్రభుత్వ అధికారులమని ఫోన్ చేసి బెదిరిస్తే ప్రజలు భయపడవద్దని సూచించారు. "డిజిటల్ అరెస్ట్" పేరుతో ఎవరైనా ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే అప్రమత్తమై పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.




అలాగే ఫేస్‌బుక్,వాట్సాప్ తదితర సామాజిక మాధ్యమాల్లో పరిచయం లేని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం,ఓటీపీ, పాస్‌వర్డ్‌లు పంచుకోవద్దని సూచించారు. అనుమానాస్పద లింకులు,ఫోన్ కాల్స్‌కు స్పందించకుండా సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.మ్యాట్రిమోనియల్ పరిచయమా..పోలీసుల ఫోన్ కాలా.. నమ్మే ముందు ఆలోచించండి.. నగదు పంపే ముందు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.



# శ్రీ సాయి మణికంఠ గణేష్ మండపంలో భక్తిపారవశ్యం

- **వైభవంగా లక్ష్మీ గణపతి హోమం, అన్నప్రసాద వితరణ**

**బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 20(డీడీ9 వార్త ) :**

సాలూర మండలంలోని సాయినగర్ కాలనీ ఆధ్యాత్మిక శోభతో విలసిల్లింది. వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కాలనీలో శ్రీ సాయి మణికంఠ గణేష్ మండపం వద్ద పూజా కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ లక్ష్మీ గణపతి హోమం కన్నులపండువగా సాగింది. ఈ ఆధ్యాత్మిక క్రతువులో భాగంగా నాలుగు జంటలు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను పూర్తి చేశాయి. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ పూజల్లో పాల్గొన్న దంపతులు స్వామివారికి ప్రత్యేక అర్చనలు నిర్వహించి ఆశీస్సులు అందుకున్నారు. లోకకల్యాణం, గ్రామాభివృద్ధిని కాంక్షిస్తూ ఈ హోమాన్ని జరిపినట్లు నిర్వాహకులు తెలిపారు. పూజల అనంతరం భక్తులకు, స్థానిక ప్రజలకు మండప నిర్వాహకులు పెద్ద ఎత్తున అన్నదాన వితరణ చేపట్టారు. భక్తులందరూ వరుసల్లో వేచి ఉండి మహాప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో పూజారి కులకర్ణి నితిన్, సురేష్, మండప నిర్వాహకులు రాజు, బ్రహ్మమ్, చిన్న, దీపక్, సంతోష్, శ్యామ్, కిరణ్, నగేష్, నాని, లోకేష్, శంకర్, మోహన్, భక్తులు పాల్గొన్నారు.



# భీముని గుట్ట వద్ద భక్తిశ్రద్ధలతో గణేష్ పూజలు

- **స్వామివారిని దర్శించుకున్న మున్సిపల్ చైర్మన్, ఏసీపీ**

**బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 20(డీడీ9 వార్త ) :**

బోధన్ పట్టణంలోని రాకాసిపేట భీముని గుట్ట ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. శ్రీ సర్వజనిక గణేష్ మండలి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నుంచి విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో స్వామివారికి విశేష అర్చనలు, అభిషేకాలు జరిపారు. అనంతరం భక్తులకు భారీ ఎత్తున అన్నదాన ప్రసాద వితరణ చేపట్టారు. పట్టణ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా బోధన్ మున్సిపల్ చైర్మన్ తూమ్ పద్మశారత్ రెడ్డి, ఏసీపీ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ, సర్వజనిక దేవుని గుట్ట గణేష్ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేశారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని భక్తులు లంబోదరుడిని వేడుకున్నారు. ఈ వేడుకల్లో అన్నదాత తాళ సుమన్ గౌడ్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గుంజేరి పోశెట్టి, నాయకులు తోకల గంగారెడ్డి, చిన్న శంకర్, తోకల చిన్న సాయిల్ అన్న, సంతోష్ గౌడ్, ప్రభాకర్, గుంజరి రాము, సాయిబాబా గౌడ్, కౌన్సిలర్ సావిత్రి, తోకల సాయిరెడ్డితో పాటు భక్తజనం విశేషంగా పాల్గొన్నారు.

# సామాజిక సేవలకు దక్కిన గుర్తింపు

- **- సితాలే రమేష్‌కు ఉత్తమ సేవా పురస్కారం**

**నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 20(డీడీ9 వార్త ) :**

ఉమ్మడి నిజామాబాద్‌కామారెడ్డి జిల్లాల్లో నిరంతరం రక్తదాన శిబిరాలు, నిరుపేదలకు, యాచకులకు అన్నదానం చేస్తూ సామాజిక సేవా రంగంలో విశేష కృషి చేస్తున్న సితాలే రమేష్‌కు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలంలో 'భారత్ రక్తదాన్ సేవా మిషన్ అసోసియేషన్' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన అందించిన విశిష్ట సేవలను కొనియాడుతూ పురస్కారంతో ఘనంగా సత్కరించారు. ఆపదలో ఉన్న వారికి సత్వరమే రక్తం అందించి ప్రాణదాతగా నిలవడం, ఆకలితో ఉన్న వారికి కడుపారా అన్నదానం చేయడం శ్లాఘనీయమని ఉత్సవ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సితాలే రమేష్ మాట్లాడుతూ.. తనకు దక్కిన ఈ గౌరవాన్ని తన తల్లిదండ్రులకు అంకితం ఇస్తున్నట్లు భావోద్వేగంతో తెలిపారు. తన సేవా ప్రయాణంలో నిరంతరం ప్రోత్సహిస్తున్న మిత్రులు, శ్రేయోభిలాషులు, రక్తదాతలు మరియు సేవా సహచరులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. "సేవే మనది.. ప్రతి ఫలం ఆ భగవంతునిది" అనే సంకల్పంతో భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపడతానని స్పష్టం చేశారు.



# ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలకు ఎప్పుడు జవాబు చెబుతుంది?

- **టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ద్రోణాచారి**

**ములుగు, సెప్టెంబర్ 20, ఆదాబ్ హైదరాబాద్ :**




అక్రమ ఆస్తులపై ఆరోపణలు చేస్తూ రాజకీయ ప్రసంగాలు చేయడం వల్ల ప్రజల సమస్యలు పరిష్కారం కావు. ఆరోపణలు ఉంటే ఆధారాలతో చట్టపరమైన మార్గంలో నిరూపించాలి. కానీ ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించడం మాత్రం సమాధానం కాదు.
మూడు సంవత్సరాలు గడుస్తున్నాయి. ఇక మాటలు కాదు — హామీల అమలుపై లెక్క చెప్పాలి!
ఏ హామీ అమలు చేశారు?ఏ హామీ ఇంకా పెండింగ్‌లో ఉంది?ఎప్పుడు అమలు చేస్తారు? ప్రజలకు స్పష్టమైన సమాధానం ఇవ్వాలి!

**కొండంత ఆరోపణలు వద్దు... కుంటంత సాకులు వద్దు!**

ప్రజలను మభ్యపెట్టే రాజకీయాలు వద్దు...
ప్రజలకు జవాబుదారీతనం కావాలి!
ప్రజలారా, మన ప్రశ్నలను మనమే బలంగా అడుగుదాం. ప్రతి హామీ అమలుపై లెక్క అడుగుదాం.ప్రజాస్వామ్య పద్ధతిలో మన గొంతును వినిపిద్దాం.ప్రజల సమస్యలపై ప్రభుత్వం స్పందించే వరకు ప్రశ్నిద్దాం!
మాట ఇచ్చారు — నిలబెట్టుకోవాలి!
హామీ ఇచ్చారు — అమలు చేయాలి!
ప్రజలు అడుగుతున్నారు — ప్రభుత్వం జవాబు చెప్పాలి!
జై తెలంగాణ! జై బీఆర్ఎస్!



# గణేష్ నవరాత్రుల్లో భక్తి సందడి..!

- **శ్రీ శ్రీనివాస యూత్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం**
- **భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. పెద్ద సంఖ్యలో పాల్గొన్న గ్రామస్థులు**
- **ఆధ్యాత్మికతతో పాటు సేవా కార్యక్రమాలకు యువత ప్రాధాన్యం**

**శాయంపేట,సెప్టెంబర్ 20,డి డి 9వార్త**

హన్మకొండ జిల్లా శాయంపేట మండలంలోని కొప్పుల గ్రామంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ శ్రీనివాస యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.గణనాథుడి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ యువత ఈ కార్యక్రమాన్ని చేపట్టింది.ఈ సందర్భంగా గణేష్ మండపం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.వేదమంత్రాలు,భక్తుల గణేష్ నామస్మరణతో పరిసర ప్రాంతం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.అనంతరం గణపతి స్వామివారికి నైవేద్యం సమర్పించి, భక్తులు,గ్రామస్థులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.అన్నదాన కార్యక్రమానికి గ్రామంలోని ప్రజలు,భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. చిన్నారులు, యువత,మహిళలు,వృద్ధులు ఉత్సాహంగా పాల్గొన్నారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శ్రీ శ్రీనివాస యూత్ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**సేవా స్ఫూర్తితో యువత......**

గణేష్ నవరాత్రి ఉత్సవాలను కేవలం పూజా కార్యక్రమాలకే పరిమితం చేయకుండా సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమని గ్రామస్థులు పేర్కొన్నారు. యువత ఐక్యంగా ముందుకు వచ్చి అన్నదానం నిర్వహించడం ద్వారా సామాజిక సేవా స్ఫూర్తిని చాటారని తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం వల్ల గ్రామంలో ఐక్యత, సోదరభావం మరింత పెరుగుతుందని పలువురు తెలిపారు. భవిష్యత్తులో కూడా శ్రీ శ్రీనివాస యూత్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని గ్రామస్థులు ఆకాంక్షించారు.గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమం విజయవంతం కావడంతో శ్రీ శ్రీనివాస యూత్ సభ్యులు,సహకరించిన గ్రామస్థులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.



# స్నేహపూర్వక సమ్మేళనమే 'ప్రసాద్ పార్టీ' ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

- **వైశ్య సంఘం గణేష్ మండపంలో ఉత్సవాలు.. హాజరైన ప్రజాప్రతినిధులు**

**నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 20(డీడీ9 వార్త ) :**

వైశ్య సంఘం వినాయక మండపాల్లో నిర్వహించే 'ప్రసాద్ పార్టీ' కేవలం విందు మాత్రమే కాదని, అది వైశ్య సోదరుల స్నేహపూర్వక సమ్మేళనమని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. నిజామాబాద్ నగరంలోని గంజ్ ప్రాంతంలో ఉన్న పట్టణ వైశ్య సంఘం భవనంలో ఏర్పాటు చేసిన "ప్రసాద్ పార్టీ"కి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హిందూ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడటంలోనూ, సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని రగిలించడంలోనూ వైశ్యులు ఎల్లప్పుడూ ముందుంటారని కొనియాడారు. వైశ్యులంతా ఐక్యతతో ఏకతాటిపై నిలిచి ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. గత 55 సంవత్సరాలుగా తాను క్రమం తప్పకుండా ఈ ప్రసాద్ పార్టీకి హాజరవుతున్నానని తన పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సంఘంలో సుదీర్ఘంగా 82 ఏళ్లుగా గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించడం ఎంతో గర్వకారణమని, యువజన సంఘం కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు అత్యంత అద్భుతంగా సాగుతున్నాయని అభినందించారు. భవిష్యత్తులోనూ ఇదే ఉత్సాహంతో వేడుకలను నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైశ్య సేవా సంఘం గణేష్ మండలి అధ్యక్షుడు శివకుమార్ గుప్తా, పట్టణ వైశ్య సంఘం నాయకులు ఇల్లెందుల ప్రభాకర్ గుప్తా, మోటూరి మురళి గుప్తా, అర్వపల్లి పురుషోత్తం గుప్తా, శ్రీనివాస్ గుప్తా, అనుబంధ సంఘాల ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.






# జాతీయ ఓబీసీ సమావేశంలో జిల్లా బీసీ నాయకులు

**నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 20(డీడీ9 వార్త ) :**

హైదరాబాద్ నగరంలోని టూరిజం ప్లాజా హోటల్లో బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ ఓబీసీ సమావేశంలో నిజామాబాద్ జిల్లా బీసీ నాయకులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జాతీయ జనాభా గణనలో బీసీ కుల గణన చేర్చాలని, బీసీలకు దక్కాల్సిన న్యాయపరమైన హక్కులను సాధించుకోవాలనే ప్రధాన అజెండాతో ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ వేదికపై దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులతో పాటు రాష్ట్రానికి చెందిన పలువురు సీనియర్ నాయకులు తమ స్వర వినిపించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ వి. హనుమంతరావు, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ సురేష్ షెట్కర్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి సచిన్ సావంత్, ఓబీసీ జాతీయ చైర్మన్ బబన్ రావ్ తయాడే తదితర ప్రముఖులు పాల్గొని దిశానిర్దేశం చేశారు. అనంతరం నిజామాబాద్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నరాల సుధాకర్ మాట్లాడుతూ.. ఇటువంటి ప్రతిష్టాత్మక జాతీయ సమావేశంలో పాల్గొనడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. బీసీ హక్కుల సాధనకు జాతీయ నాయకులు అందించిన మార్గదర్శకాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నరాల సుధాకర్‌తో పాటు జిల్లా నాయకులు దర్శనం దేవేందర్, చంద్రకాంత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# ఇవేం బతుకులు.. మెతుకు పెట్టని మేదరి బతుకులు..!

- రెక్కాడితే గానీ డొక్కాడని" ఈ కుటుంబాలకు భరోసా ఇచ్చే రోజు ఎప్పుడు..?
- ఈ కుటుంబాలపై పాలకులు దృష్టి సారించాల్సిన అవసరం లేదా...?
- బుట్టలు.. శాటలు.. గంపలు.. తడికెలే ఇంటిల్లిపాదికి జీవనాధారం
- అడవిలోని వెదురే ఆధారం.. చేతుల కష్టంతోనే కుటుంబాల పోషణ
- ఏ ప్రభుత్వం ఆదుకోలేదు.. ఏ బ్యాంకు రుణం ఇవ్వలేదు..!





**ఏటూరునాగారం క్రైం, డీడీ 9 వార్త, సెప్టెంబర్ 20:**

"ఇవేం బతుకులు.. మెతుకు పెట్టని మేదరి బతుకులు.." అంటూ మేదరి కులస్థులు తమ జీవన పరిస్థితులను చెప్పుకుంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తరతరాలుగా చేతివృత్తినే నమ్ముకుని జీవిస్తున్న తమ కుటుంబాలకు ప్రభుత్వాల నుంచి ఆర్థిక సహాయం అందలేదని,బ్యాంకుల నుంచి రుణ సదుపాయం కూడా లభించలేదని వారు వాపోతున్నారు.ములుగు జిల్లాలోని పలు మండలాల్లో సుమారు 37 మేదరి కుటుంబాలు ఉన్నట్లు వారు చెబుతున్నారు. తాడ్వాయి మండలం కాటాపూర్‌లో కూడా ఓ మేదరి కుటుంబం తరతరాలుగా ఇదే చేతివృత్తిని నమ్ముకుని జీవిస్తోంది. వారి జీవన చిత్రాన్ని వారి మాటల్లోనే చూస్తే.. కష్టాలే కళ్లముందు కనిపిస్తాయి.

**అడవిలోని వెదురే.. అల్లికలకు ఆధారం..!**

పూర్వకాలంలో జీవనోపాధి కోసం ఈ ప్రాంతానికి వచ్చామని మేదరి కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అప్పట్లో అడవులు సమృద్ధిగా ఉండేవని,అడవిలో లభించే వెదురును సేకరించి దానితో బుట్టలు, శాటలు,తడికెలు తయారు చేసి చుట్టుపక్కల గ్రామాల్లో విక్రయించేవారమని తెలిపారు. వెదురును ముక్కలుగా చీల్చి చిన్నచిన్న పీసులుగా తయారు చేసి నీటిలో నానబెట్టి వాటితో బుట్టలు, గంపలు,శాటలు ,పెద్ద తడికెలు అల్లుతామని తెలిపారు.ఇళ్లలో బియ్యం,ధాన్యం నిల్వ చేసుకునేందుకు గంపలు,శాటలు ఉపయోగపడతాయని, ఇంటి గోడలకు బదులుగా తడికెలను ఉపయోగించి గుడిసెలు ఏర్పాటు చేసుకునేవారని వివరించారు. రోజంతా కష్టపడితేనే ఒకటి రెండు వస్తువులు తయారవుతాయని, వాటిని విక్రయించిన డబ్బుతోనే కుటుంబాన్ని పోషించుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**చేతుల కష్టమే పెట్టుబడి.. నొప్పులే మిగులు..!**

ఉదయం నుంచి సాయంత్రం వరకు వెదురును చీల్చడం,అల్లడం, వస్తువులను తయారు చేయడంతో చేతులు,కాళ్లు,నడుము నొప్పులతో బాధపడుతున్నామని వారు తెలిపారు.అయినా జీవనోపాధి కోసం ఈ వృత్తిని వదులుకోలేక పోతున్నామని చెబుతున్నారు.ఒక కుటుంబంలో తల్లిదండ్రులు, నలుగురు పిల్లలు కలిసి ఈ వృత్తిపై ఆధారపడి జీవించారని తెలిపారు. తల్లిదండ్రులు కష్టపడి పిల్లలను స్థానిక పాఠశాలలో పదో తరగతి వరకు చదివించామని,ఇద్దరు కుమార్తెలకు వివాహాలు చేశామని, ఇద్దరు కుమారులు మాత్రం ఇప్పటికీ తల్లిదండ్రులతో కలిసి ఈ వృత్తిలోనే ఉంటూ కుటుంబానికి చేదోడువాదోడుగా నిలుస్తున్నారని వివరించారు.

**ఏ ప్రభుత్వం.. ఏ బ్యాంకును ఆశ్రయించలేదు..!**

తమ కుటుంబాలు చేతివృత్తిపై ఆధారపడి జీవిస్తున్నప్పటికీ ఇప్పటివరకు ఏ ప్రభుత్వం నుంచి ప్రత్యేక ఆర్థిక సహాయం పొందలేదని, ఏ బ్యాంకు నుంచి రుణం కూడా తీసుకోలేదని మేదరి కుటుంబాలు చెబుతున్నాయి."మా చేతుల కష్టంతోనే సామాగ్రి తయారు చేసి, వాటిని అమ్ముకుని వచ్చిన డబ్బుతోనే పూటలు వెళ్లదీస్తున్నామని మా వృత్తిని అభివృద్ధి చేసుకోవడానికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందలేదని బ్యాంకుల నుంచి రుణ సదుపాయం



కూడా పొందలేదని" వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**13 కుటుంబాల జీవనాధారం..!**

కాటాపూర్ గ్రామంలో సుమారు 13 కుటుంబాలు ఈ చేతివృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నాయని వారు తెలిపారు.తరతరాలుగా వస్తున్న ఈ వృత్తిని కొనసాగిస్తున్నప్పటికీ ఆర్థికంగా ఎదిగే అవకాశం లేకుండా పోతోందని వాపోతున్నారు. చేతివృత్తులను ప్రోత్సహిస్తామని ప్రభుత్వాలు చెబుతున్నప్పటికీ తమలాంటి సంప్రదాయ వృత్తిదారుల జీవితాల్లో మాత్రం మార్పు కనిపించడం లేదని అంటున్నారు. తమ వృత్తికి అవసరమైన ముడిసరుకు,తయారు చేసిన వస్తువులకు మార్కెట్,ఆర్థిక సహాయం, బ్యాంకు రుణాలు వంటి సదుపాయాలు కల్పిస్తే తమ కుటుంబాలు నిలదొక్కుకునే అవకాశం ఉంటుందని వారు కోరుతున్నారు.చేతుల్లో కళ ఉన్నా.. ఆర్థికంగా అండ లేక తరతరాలుగా వృత్తిని కాపాడుకుంటూ మెతుకు కోసం మేదరి కుటుంబాల జీవన పోరాటం కొనసాగుతోంది.

**చేతివృత్తికి చేయూత ఎప్పుడు..?**

తరతరాలుగా సంప్రదాయ చేతివృత్తిని నమ్ముకుని జీవిస్తున్న మేదరి కుటుంబాలకు ప్రభుత్వ ప్రోత్సాహం ఎప్పుడు అందుతుంది.? వెదురుతో కళాఖండాలు,నిత్యావసర వస్తువులు తయారు చేస్తున్న ఈ కుటుంబాలకు ఆర్థిక సాయం,బ్యాంకు రుణాలు,ముడిసరుకు,మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకుంటాయి..? చేతుల్లో నైపుణ్యం ఉండి కష్టపడే మనస్తత్వం ఉన్నా ఆర్థికంగా ఎదగలేని ఈ కుటుంబాలపై పాలకులు దృష్టి సారించాల్సిన అవసరం లేదా...? సంప్రదాయ చేతి వృత్తులను కాపాడుతామని చెప్పే ప్రభుత్వాలు వాటిపై ఆధారపడి బతుకుతున్న కుటుంబాల బతుకులను మార్చేందుకు ఎప్పుడు ముందుకు వస్తాయి...? "రెక్కాడితే గానీ డొక్కాడని" ఈ కుటుంబాలకు భరోసా ఇచ్చే రోజు ఎప్పుడు..? అన్నదే ఇప్పుడు మేదరి కుటుంబాల ప్రశ్న.

# కేటీఆర్‌ది రాజకీయ రాద్ధాంతమే

* సాగునీటిపై పదేళ్ల పాలనలో ఏం చేశారో చెప్పాలి
* పోతిరెడ్డిపాడు, వెలిగొండపై అప్పట్లో ఎందుకు మౌనం?
* ఎల్‌నినోపై రాజకీయాలు చేయడం అవగాహన లేమికి నిదర్శనం
* వనపర్తి జిల్లా కాంగ్రెస్

**వనపర్తి,సెప్టెంబరు 20 (డీడీ9 వార్త):**

బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ శనివారం పెబ్బేరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వాస్తవాల కంటే రాజకీయ ఆరోపణలకే ప్రాధాన్యమిచ్చారని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది.

పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం సాగునీటి రంగంలో ఏం సాధించిందో ప్రజలకు వివరించకుండా, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై విమర్శలు చేయడం సరికాదని పేర్కొంది. ఈ మేరకు ఆదివారం కాంగ్రెస్ పార్టీ ప్రకటన విడుదల చేసింది.

**పోతిరెడ్డిపాడుపై అప్పుడెందుకు మౌనం?**

సాగునీటి విషయంలో ప్రస్తుతం పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్న కేటీఆర్.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణకు ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఆంధ్రప్రదేశ్ చేపట్టిన పోతిరెడ్డిపాడు, వెలిగొండ ప్రాజెక్టుల అంశాలు ముందుకు సాగుతున్న సమయంలో తెలంగాణ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నించింది.

పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 44 వేల క్యూసెక్కుల నుంచి 80 వేల క్యూసెక్కులకు పెంచే ప్రతిపాదన 2019లోనే వెలుగులోకి వచ్చిందని కాంగ్రెస్ పేర్కొంది. అప్పట్లో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ప్రయోజనాల కోసం గట్టిగా ఎందుకు స్పందించలేదని ప్రశ్నించింది. పదేళ్లు అధికారంలో ఉండి ఇప్పుడు రైతుల నీటి హక్కుల గురించి మాట్లాడటం రాజకీయ ప్రయోజనాల కోసమేనని విమర్శించింది.

**వెలిగొండ చరిత్రను విస్మరిస్తున్నారని విమర్శ**

వెలిగొండ ప్రాజెక్టు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలోనే ప్రారంభమైందని కాంగ్రెస్ తెలిపింది. 2004లో పరిపాలనా అనుమతులు పొందగా.. 2005లో పనులు ప్రారంభమైనట్లు కాగ్ నివేదికలో పేర్కొన్న విషయాన్ని గుర్తుచేసింది. ఇలాంటి ప్రాజెక్టుల చరిత్రను పక్కనపెట్టి ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నింటికీ కారణమన్నట్లుగా మాట్లాడటం సరికాదని పేర్కొంది.

**'ఏడు లక్షల ఎకరాలు' లెక్కలు చెప్పాలి**

బీఆర్ఎస్ పాలనలో ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని కేటీఆర్ చెబుతున్నారని.. ఆ లెక్కలకు సంబంధించిన వివరాలను ప్రజల ముందు ఉంచాలని కాంగ్రెస్ కోరింది. ఏ కొత్త ప్రాజెక్టులను నిర్మించారు? వాటి నుంచి ఎంత నీటిని విడుదల చేశారు? కొత్తగా ఎన్ని ఎకరాలకు సాగునీరు అందించారు? అనే వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేసింది.

గత ప్రభుత్వాల హయాంలో నిర్మించిన ప్రాజెక్టుల ద్వారా వచ్చిన నీటిని తమ పాలనలో సాధించిన ఘనతగా చెప్పుకోవడం, కొత్త ప్రాజెక్టులను నిర్మించి నీటిని అందించడం రెండూ ఒకటి కాదని కాంగ్రెస్ పేర్కొంది.

**ఎల్‌నినోపై రాజకీయాలు తగవు**



ఎల్‌నినో వంటి సహజ వాతావరణ పరిణామాలను కూడా ప్రభుత్వాల వైఫల్యంగా చిత్రీకరించడం సరైంది కాదని కాంగ్రెస్ తెలిపింది. ఎల్‌నినో ప్రభావం వర్షపాతం, ఉష్ణోగ్రతలు, వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపుతుందని పేర్కొంది. దాని ప్రభావం ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా ఉండవచ్చని వివరించింది. ప్రకృతి సంబంధిత అంశాలను కూడా రాజకీయ విమర్శలకు ఉపయోగించుకోవడం సరైన విధానం కాదని పేర్కొంది.

**జూరాలపై వాస్తవాలు తెలుసుకోవాలి**

జూరాల ఆయకట్టు కింద ఒక్క ఎకరం ఎండినా ఊరుకోబోమని కేటీఆర్ చెప్పడం ఒకవైపు.. జూరాలలో నీరు లేదని పేర్కొనడం మరోవైపు ఉందని కాంగ్రెస్ విమర్శించింది. ప్రాజెక్టులో నీటి లభ్యత, నిల్వలు, విడుదలలు, ఆయకట్టు అవసరాలను శాస్త్రీయంగా పరిశీలించిన తర్వాతే వాస్తవ పరిస్థితులపై మాట్లాడాలని సూచించింది.

**రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ లక్ష్యం**

తెలంగాణ రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పేర్కొంది. పక్క రాష్ట్రాలతో చర్చలు జరుపుతూ తెలంగాణకు రావాల్సిన నీటి వాటా కోసం ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తోందని తెలిపింది. రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను పక్కనపెట్టి రాజకీయ విమర్శలు చేయడం వల్ల ప్రయోజనం ఉండదని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది.

# పతకాలే లక్ష్యంగా ముందుకు సాగాలి

- జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాకిటి శ్రీధర్

**వనపర్తి,సెప్టెంబర్ 20 (డీడీ9 వార్త):**

అథ్లెటిక్స్ క్రీడాకారులు నిరంతరం సాధన చేస్తూ తమ శారీరక దారుఢ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాకిటి శ్రీధర్ సూచించారు.

రాష్ట్ర, జాతీయస్థాయిలో పతకాలు సాధించి వనపర్తి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహించనున్న 12వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2026 పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేసేందుకు ఆదివారం వనపర్తి డాక్టర్ బాలకృష్ణయ్య స్టేడియం మైదానంలో ఎంపికలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వాకిటి శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు.అథ్లెటిక్స్‌లో ప్రతిభను మెరుగుపరుచుకోవాలంటే క్రమశిక్షణతో కూడిన సాధన ఎంతో ముఖ్యమని ఆయన అన్నారు. పోటీల్లో పాల్గొనే ప్రతి క్రీడాకారుడు తన సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో ప్రదర్శించాలని సూచించారు. వనపర్తి జిల్లా అథ్లెట్లు గతంలో రాష్ట్ర, జాతీయస్థాయిలో పతకాలు సాధించి జిల్లాకు మంచి గుర్తింపు తీసుకొచ్చారని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో ప్రస్తుత క్రీడాకారులు కూడా రాణించి పతకాలు సాధించాలని కోరారు.



జిల్లా నలుమూలల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు ఎంపికలకు హాజరయ్యారు. అనంతరం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వనపర్తి జిల్లా ఉత్తమ పీడీగా అవార్డు పొందిన జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నందిమల్ల శ్రీకాంత్‌ను వాకిటి శ్రీధర్ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎండీ షంషీర్ అలీ,సీనియర్ క్రీడాకారుడు అహ్మద్,పీడీ నందన్,పీఈటీలు జబ్బార్,మహేష్,ఉమాశంకర్, దామోదర్,అజయ్,వహీద్, గోవింద్,మాలతి,స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



# గణేష్ వేడుకల్లో లడ్డూ వేలం సందడి

**ఆదిలాబాద్ జిల్లా: సోనాల మండలం: సెప్టెంబర్ 20: (డి డి 9 వార్త న్యూస్):**

స్థానిక సొనాల మండలంలోని గణేష్ నవరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో, పల్లె వాతావరణంలో సందడిగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన లడ్డూ వేలంలో గ్రామానికి చెందిన దండారి రంజిత్ లడ్డూను 12,100 రూపాయలకు సొంతం చేసుకున్నారు. వేలం సందర్భంగా గ్రామస్తులు, యువకులు ఉత్సాహంగా పాల్గొని గణేష్ నామస్మరణతో సందడి చేశారు. లడ్డూను దక్కించుకున్న రంజిత్‌ను నిర్వాహకులు, గ్రామస్తులు అభినందించారు.



# ఫత్తేపూర్ గణేష్ మండపం వద్ద భక్తిశ్రద్ధలతో అన్నదానం

- సర్పంచ్ నూర్ అహ్మద్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నప్రసాద వితరణ
- మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన వేడుకలు

**బోధన్, నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 20(డీడీ9 వార్త):**

సాలూర మండలంలోని ఫత్తేపూర్ గ్రామంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ కన్నులపండువగా సాగుతున్నాయి. ఆదివారం గ్రామంలో శ్రీ శివ గణేష్ మండపం వద్ద సర్పంచ్ నూర్ అహ్మద్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. పూజారి రవిబాబా వినాయకునికి ప్రత్యక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు సర్పంచ్ స్వహస్తాలతో అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... పండుగలు, ఉత్సవాలు ప్రజల మధ్య ఐక్యతను, సామరస్యాన్ని పెంచుతాయని అన్నారు. కులమతాలకు అతీతంగా గ్రామాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామంలో మత సామరస్యానికి నిదర్శనంగా నిలిచిన ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు సర్పంచ్, ఉప సర్పంచ్ లకు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోసిన్, ఖాజా, గౌస్, అహమ్మద్, రవి, పోశెట్టి, గంగారాం, గంగాధర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.




# కుటుంబ కలహాలతో తల్లి ముగ్గురు పిల్లలతో సహా అదృశ్యం

**కోటగిరి సెప్టెంబర్ 20 (డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలంలోని యాద్గార్ పూర్ గ్రామానికి చెందిన బి .సాయి లత కుటుంబ కలహాలతో తన ముగ్గురు పిల్లలతో సహా అదృశ్యమైంది. శుక్రవారం భర్త ప్రశాంత్ తో గోడవ పడింది. ఈమెకు చైతన్య ,చైత్ర, చైతు అనే ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఎత్తొండ క్యాంప్ లో ఉన్న తన పుట్టింటికి వెళ్తానని చెప్పి వెళ్లి అదృశ్యమైంది. ఈ విషయమై అల్లుడు ప్రశాంత్ మామ లక్ష్మణుకు సమాచారం అందించగా యద్గర్పూర్ గ్రామానికి వచ్చి చూడగా జాడ తెలియలేదు. కూతురు వెళ్లే సమయంలో ఆకుపచ్చ పంజాబీ డ్రెస్ ధరించి ఉంది. సాయి లత తెలుగు కన్నడ మరాఠీ భాష మాట్లాడగలదు. ఈ మేరకు తండ్రి లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు









# గుంతల రోడ్లతో ప్రజల అవస్థలు

- **చినుకు పడితే రోడ్డుపై నడవాలంటే ప్రయాణికులకు రైతులకు ఇబ్బందులు**
- **రోడ్డుపై నడవాలంటే నరకయాతన పడుతున్న వాహనదారులు**
- **పట్టించుకోని అధికారులు**

**రాయపోల్ సెప్టెంబర్ 20(డీడీ9 వార్త):**

ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లపై ఏర్పడిన భారీ గుంతలు వాహనదారులకు నిత్య నరకయాతనగా మారాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు గుంతలను తప్పించుకునే క్రమంలో ప్రమాదాల బారిన పడే పరిస్థితి నెలకొంది.సిద్ధిపేట జిల్లా రాయపోల్ మండలంలోని కొత్తపల్లి, రాంసాగర్, గొల్లపల్లి, రామారం, చౌదరిపాలేం, తిమ్మక్కపల్లి నుంచి లింగా పూర్ తదితర గ్రామాల్లో రోడ్లు పరిస్థితి దాయనియంగా ఉంది

ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్ల పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాటి లోతు తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పలుచోట్ల రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. నిత్యం ఈ మార్గాల్లో ప్రయాణించే ప్రజలు సమయం, ఇంధనం వృథా చేసుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలకు నిలయంగా.. గుంతలు తప్పించుకునేందుకు వాహనదారులు ఒక్కసారిగా రోడ్డు పక్కకు మళ్లడం, ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించుకునే ప్రయత్నం చేయడంతో ప్రమాదాల ముప్పు పెరుగుతోంది. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది. సరైన వీధి దీపాలు లేకపోవడం, గుంతలు నీటితో నిండిపోవడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**పట్టించుకోని అధికారులు**

రోడ్ల దుస్థితిపై స్థానికులు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. తాత్కాలికంగా గుంతల్లో మట్టి, కంకర పోసినా వర్షాలకు అవి కొట్టుకుపోతున్నాయని చెబుతున్నారు. దీంతో సమస్య మళ్లీ మొదటికొస్తోందని వాపోతున్నారు. శాశ్వత పరిష్కారం చూపాలి గుంతలను వెంటనే పూడ్చడంతోపాటు దెబ్బతిన్న రోడ్లను పూర్తిస్థాయిలో పునర్నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.







# టీఆర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎదురుదాడి

- **పాలమూరు అభివృద్ధిపై ఇప్పుడు ప్రేమ ఒలకబోస్తున్నారు**
- **విద్యుత్, సాగునీటి అంశాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపణ**

**వనపర్తి,సెప్టెంబరు 20 (డీడీ9 వార్త):**

బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పాలమూరు ఉమ్మడి జిల్లా పర్యటన సందర్భంగా చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా స్పందించారు.

ఆదివారం పెబ్బేరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేటీఆర్ వ్యాఖ్యలను ఖండిస్తూ పలు విమర్శలు చేశారు. పాలమూరు ప్రాంతంపై కేటీఆర్‌కు ఇప్పుడు ఎక్కడ లేని ప్రేమ పుట్టుకొచ్చిందని ఎద్దేవా చేశారు.

**రైతుల పేరుతో రాజకీయాలు తగవు**

కేటీఆర్ పర్యటన సందర్భంగా రైతుల సమస్యలను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం సరికాదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. గుమ్మడం ప్రాంతంలో విద్యుత్ సరఫరాపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయని ఆరోపించారు. రైతుల పేరుతో ఆందోళన నిర్వహిస్తామని ప్రకటించి, తగిన సంఖ్యలో రైతులు రాకపోవడంతో ఇతరులను తీసుకొచ్చి విద్యుత్ కార్యాలయాన్ని సందర్శించి తప్పుడు ప్రచారం చేశారని విమర్శించారు.

**ప్రాజెక్టులపై తప్పుడు లెక్కలంటూ ఆరోపణ**

ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల్లో నీటి నిల్వలపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు తప్పుబట్టారు. జూరాల ప్రాజెక్టు నీటి సామర్థ్యంపై కూడా ఆయన తప్పుడు వివరాలు చెబుతూ ప్రజలను, రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. సాగునీటి అంశాలపై వాస్తవాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత రాజకీయ నాయకులపై ఉందని పేర్కొన్నారు.

**అసెంబ్లీకి హాజరై సమస్యలపై మాట్లాడాలి**

ప్రతిపక్షంలో ఉన్న నాయకులు అసెంబ్లీ సమావేశాలకు హాజరై ప్రజా సమస్యలను ప్రస్తావించాలని కాంగ్రెస్ నాయకులు సూచించారు. సభకు హాజరుకాకుండా ప్రభుత్వంపై విమర్శలు చేయడం సమంజసం కాదన్నారు. రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

**వ్యక్తిగత విమర్శలు**

కొల్లాపూర్‌లో మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి తండ్రి అంత్యక్రియలకు హాజరై తిరుగు ప్రయాణంలో పెబ్బేరుకు వచ్చి రాజకీయ విమర్శలు చేయడం సరికాదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. కేటీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ ఉన్న భూములకు సంబంధించిన వ్యవహారాలపై త్వరలోనే లెక్కలు తేలుతాయని వ్యాఖ్యానించారు. సామాన్య ప్రజలను మోసం చేసే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు.

కేటీఆర్ పెబ్బేరుకు వచ్చిన సమయంలో వర్షం కురవడాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలు రాజకీయ ప్రచారానికి ఉపయోగించుకోవడాన్ని కాంగ్రెస్ నాయకులు ఎద్దేవా చేశారు. వర్షాలను రాజకీయాలకు ముడిపెట్టడం సరికాదన్నారు.

సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ శ్రీనివాస్ గౌడ్,పార్టీ మండల అధ్యక్షుడు రాంరెడ్డి,పట్టణ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, మాలపల్లి సర్పంచి అశోక్, మార్కెట్‌యార్డు వైస్ ఛైర్మన్ విజయవర్ధన్‌రెడ్డి,నాయకులు రంజిత్‌కుమార్,సురేందర్‌గౌడ్, వెంకటేష్ సాగర్,యుగంధర్‌రెడ్డి, నరేందర్,శ్రీహరి, విష్ణు,రాములు, రాజు,ఉత్తమ్ తదితరులు పాల్గొన్నారు.




## ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాన్ని ప్రారంభించిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

**నవాబుపేట్,సెప్టెంబర్ 20 (డీడీ9 వార్త):**

నవాబుపేట్ పేదల సొంతింటి కలని సహకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని చేవెళ్ల ఎమ్మెల్యే కాల యాదయ్య అన్నారు

నవాబుపేట్ మండలంలోని నాగిరెడ్డి పల్లి గ్రామంలో స్వరూప మహేందర్ ఇందిరమ్మ ఇండ్లు పూర్తి కావడంతో నిర్వహించిన గృహప్రవేశంలో ఈ కార్యక్రమానికి ఆయన హాజరై నూతన గృహాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు సొంతింటి ఇంటి కళ సహకారం అవుతుందన్నారు ఇల్లు నిర్మాణం పూర్తి కావడంతో లబ్ధిదారులు నూతన గృహప్రవేశంలోకి అడుగుపెట్టడం ఎంతో సంతోషకరమైన విషయమని ఆయన అన్నారు గ్రామం లో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణి



చేశారు పేదల సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుంది అని అయన అన్నారు.ఈ కార్యక్రమం లో అధికారులు ,నాయకులు గ్రామస్తులు,యువత తదితరులు పాల్గొన్నారు.



## వినాయకుడి లడ్డును రూ. 67000/కు కైవసం చేసుకున్న నర్కూడ గ్రామానికి చెందిన నవీన్ యాదవ్

**శంషాబాద్,సెప్టెంబర్20 (డీడీ9 వార్త)**

వినాయక చవితి నవరాత్రులలో బాగంగా శంషాబాద్ మండలం నర్కూడ శ్రీనివాస కాలనీలో వినాయక లడ్డూ వేలం పాటని ర్వహించిన దానికి పోటాపోటీగా భక్తులు పోటీలో పాల్గొన్నారు.ఈ వేలం పాటలో నర్కూడ గ్రామానికి చెంది నవీన్ యాదవ్ పవిత్రమైన వినాయకుని లడ్డు 67000/ వేల రూపాయలకు వేలం పాటలో పాల్గొని లడ్డు దక్కించుకున్నారు.అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు వారిని శాలువాతో ఘనంగా సత్కరించి,అభినందనలు తెలిపారు.





## కురుమూర్తి క్షేత్ర అభివృద్ధికి మహర్దశ,- జూలై నాటికి ఎలివేటెడ్ కారిడార్ పూర్తి.

- **రూ.110 కోట్లతో ప్రతిష్ఠాత్మక నిర్మాణం.**
- **పనులు వేగవంతం చేయాలని ఆర్అండ్‌బీ అధికారులకు మంత్రి కోమటిరెడ్డి ఆదేశం**

**చిన్నచింతకుంట,సెప్టెంబర్ 20 (డీడీ9 వార్త):**

చిన్న చింతకుంట మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశ్రీశ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. కురుమూర్తి క్షేత్రానికి వచ్చే భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు రూ.110 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్‌తో కూడిన ఘాట్ రోడ్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి.

నిర్మాణ పనుల పురోగతిని ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి,రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి,దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆర్అండ్‌బీ అధికారులను పనుల పురోగతి,ఇప్పటివరకు పూర్తయిన పనులు,మిగిలిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

పనుల్లో మరింత వేగం పెంచి నిర్ణీత గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. నిర్మాణ నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా పనులను వేగవంతం చేయాలని సూచించారు.

**జూలై నాటికి భక్తులకు అందుబాటులోకి**

అనంతరం మంత్రులు,ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ వచ్చే జూలై నాటికి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు, భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎలివేటెడ్ కారిడార్ పూర్తయితే కురుమూర్తి స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా క్షేత్రానికి వెళ్లే ఘాట్ రోడ్ మార్గంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడి, భక్తుల ప్రయాణానికి సౌలభ్యం కలుగుతుందని తెలిపారు.

**రూ.110 కోట్ల మంజూరుకు సీఎంకు, మంత్రికి కృతజ్ఞతలు**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ శ్రీ కురుమూర్తి స్వామి క్షేత్ర అభివృద్ధి, భక్తుల సౌకర్యార్థం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి రూ.110 కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కురుమూర్తి స్వామి క్షేత్రానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారని, వారి రాకపోకలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం పూర్తయితే భక్తులకు రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు కురుమూర్తి క్షేత్రం, పరిసర ప్రాంతాల అభివృద్ధికి ఇది కీలకంగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

కురుమూర్తి క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేసి భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగుతున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వివిధ గ్రామాల సర్పంచులు,ప్రజా ప్రతినిధులు, అధికారులు ,మహిళలు కార్యకర్తలు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

## అరుణోదయ యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

- **కార్యక్రమంలో పాల్గొన్న మొయినాబాద్ సీఐ మల్లికార్జున రెడ్డి**

**మొయినాబాద్ సెప్టెంబర్ 20(డీడీ9 వార్త):**

మొయినాబాద్ మున్సిపాలిటీలోని అజిత్ నగర్ గ్రామంలో అరుణోదయ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో మన సీఐ మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ అన్నదాన ప్రభువు పట్లోల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. యువత సేవా కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనడం ద్వారా సామాజిక సమాజానికి మంచి సందేశం వెళ్తుందన్నారు.వినాయకుని మండపంలో డీజేలు పెట్టకూడదని అసాంఘిక కార్యక్రమాలకు ఎవరైనా పాల్పడితే వెంటనే పోలీస్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ యూత్ సభ్యులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ఉచిత ఎస్ఐ, కానిస్టేబుల్ పరీక్షకు విశేష స్పందన

- **సుమారు 400 మంది అభ్యర్థుల హాజరు..**
- **పోటీ పరీక్షలపై అవగాహన కల్పించడమే లక్ష్యం**

**వనపర్తి,సెప్టెంబరు 20 (డీడీ9 వార్త):**

నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల దిశగా మార్గనిర్దేశం చేయడంతో పాటు, పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయాలనే లక్ష్యంతో నిర్వహించిన ఉచిత ఎస్ఐ, కానిస్టేబుల్ ప్రవేశ పరీక్షకు విశేష స్పందన లభించింది. పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పి. మధుకర్ స్వామి ఆధ్వర్యంలో ఆదివారం వనపర్తిలోని రేడియంట్ హైస్కూల్, తిరుమల హిల్స్ ఆవరణలో పరీక్ష నిర్వహించారు.

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 400 మంది అభ్యర్థులు హాజరై ఉత్సాహంగా పరీక్ష రాశారు.

**అభ్యర్థులకు ప్రోత్సాహం**

పరీక్షా కేంద్రాన్ని పెద్దమందడి ఎస్ఐ జలంధర్‌రెడ్డి సందర్శించి అభ్యర్థులను అభినందించారు. పోలీసు ఉద్యోగాల కోసం పోటీ పడుతున్న యువత లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని సూచించారు. ప్రస్తుత పోటీ పరిస్థితుల్లో సాధారణ పరిజ్ఞానం, సమకాలీన అంశాలు, ప్రాథమిక అంశాలపై పట్టు పెంచుకోవడంతో పాటు రోజువారీగా సాధన చేయడం ద్వారా పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఉద్యోగ సాధనకు పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర సాధన ఎంతో అవసరమని పేర్కొన్నారు.

**యువతకు ఉపయోగపడేలా కార్యక్రమాలు**

పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు అవసరమైన అవగాహన, మార్గనిర్దేశం అందించేందుకు పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల యువతకు సైతం పోటీ పరీక్షలపై అవగాహన కల్పించి, వారికి అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలపై మార్గనిర్దేశం చేయడమే తమ లక్ష్యమన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రాంతాల్లో ఇలాంటి ఉచిత పరీక్షలు, అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తామని ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ గద్దె భాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో సాహితీ కళావేదిక అధ్యక్షులు పలుస శంకర్‌గౌడ్, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ గద్దె భాస్కర్, డా. గద్దె ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉప్పరి తిరుమలేష్,శైలజ,బాలా సుబ్రహ్మణ్యం,వెంకటేష్, మల్లేష్,రాహుల్, భాను,రజిత తదితరులు పరీక్ష నిర్వహణకు సహకరించారు.




## పేదల అండగా మాజీ సర్పంచ్

**నంద్యాల,సెప్టెంబర్ 20(డీడీ9 వార్త):**

నంద్యాల జిల్లాపాములపాడు మండలంలోని ,వేంపెంట గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన షేక్ జమిలాబి (70)పార్థివ దేహానికి మాజీ సర్పంచ్ టేకూరి రామసుబ్బమ్మ పూల మాల వేసి,నివాళులు అర్పించి ఆమె కుటుంబానికి 5000/ రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ధైర్యంగా ఉండాలని ఆ కుటుంబానికి టేకూరి రామసుబ్బమ్మ భరోసా ఇచ్చారు. ఈ విషయం తెలుసుకొని సింగపూర్ దేశం నుండి డాక్టర్ టేకూరి.నాగేశ్వరావు ఆమె కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని, సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ బోనపల్లె సత్యరాజు, మాజీ ఎంపీటీసీ శివకుమార్, ముద్దపాటి ప్రసాద్,రత్నాకర్, జీవన్న,బోనాల భాస్కర్, సుబ్బారావు,దార కిరణ్, సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.





# యోగా లేదా జిమ్.. ఏది బెస్ట్ ఆప్షన్?



శరీరాన్ని ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉంచుకోవాలనుకుంటే యోగా లేదా వ్యాయామం చేయాల్సిందే.. ప్రస్తుతం ఎక్కువ మంది ఊబకాయం సమస్యతో సతమతమవుతున్నారు. అలాంటి పరిస్థితుల్లో జిమ్‌లో చెమటలు కక్కుతున్నారు. కొంతమంది వ్యాయామ శిక్షణపై దృష్టి పెడతారు. శారీరక దృఢత్వం, ఆరోగ్యం కోసం వ్యాయామం అనే శారీరక ప్రక్రియను చేస్తారు. ఇలా చేయడం వలన శారీరకంగానే కాదు మనసికమగా కూడా అనేక ప్రయోజనాలను పొందుతారు.మరోవైపు ఒత్తిడి, డిప్రెషన్ వంటి సమస్యలను దూరం చేసుకోవాలనుకునే వారు యోగా, ప్రాణాయామం చేస్తుంటారు. యోగాతో మీరు ఏకాగ్రత నేర్చుకుంటారు. యోగా .. జిమ్ వర్కౌట్‌లలో ఏది బెటర్ అనే ప్రశ్న కొంతమందికి ఎప్పుడూ మనసులో ఉంటుంది. ఈ విషయంపై కల్ట్ ట్రాన్స్‌ఫార్మ్ యోగా ఎక్స్‌పర్ట్ దివ్య రోల్లా అనేక విషయాలను చెప్పారు. ఆరోగ్యంగా ఉండాలంటే శరీరాన్ని చురుగ్గా ఉంచుకోవడం చాలా అవసరమని చెబుతున్నారు. దీంతో ఊబకాయం, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు రాకుండా ఉంటాయి. అంతేకాదు మన శరీరంలోని కండరాలు కూడా ఫ్లెక్సిబుల్‌గా ఉంటాయి. యోగా, జిమ్ వ్యాయామాల మధ్య వ్యత్యాసం ఉంది. ఈ రెండింటి మధ్య తేడా గురించి ముందుగా చెప్పుకుందాం.

**యోగా అంటే ఏమిటి?**

యోగా అనేది భౌతిక భంగిమలు, ధ్యానం, లోతైన శ్వాసలతో కూడిన ఒక పురాతన అభ్యాసం. యోగా అనేది శరీరం, మనస్సు, ఆత్మ ఐక్యంగా ఉండే ఆధ్యాత్మిక ప్రక్రియ. ఈ పదం హిందూమతం, జైనమతం, బౌద్ధమతంలో ధ్యాన ప్రక్రియకు సంబంధించినది. యోగా అనేది సంస్కృత పదం యుజ్ నుండి వచ్చింది. అంటే సేకరించడం లేదా బంధించడం. యోగా ఒక ఆధ్యాత్మిక క్రమశిక్షణ. యోగాలో సూర్య నమస్కారంతో సహా అనేక ఆసనాలు, ప్రాణాయామం ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలు గణనీయంగా యోగా పట్ల ఆసక్తిని చూపిస్తున్నారు.

**జిమ్ వ్యాయామం**

జిమ్ గురించి అందరికీ తెలుసు. వ్యాయామశాలలో వివిధ యంత్రాలతో పాటు గాడ్జెట్లను ఉపయోగించి వ్యాయామం చేస్తారు. ఫిట్ , టోన్డ్ బాడీని పొందడానికి చాలా మంది జిమ్‌కి వెళ్తుంటారు. ప్రజలు జిమ్‌కి వెళ్లి కార్డియో, కాళ్లు , వెయిట్ లిఫ్టింగ్ వంటి వివిధ వ్యాయామాలు చేస్తారు.

**రెండింటిలో ఏది మంచిది?**

రెండు ఆరోగ్యానికి మేలు చేసేవే అని యోగా ఎక్స్‌పర్ట్ దివ్య రోలా చెబుతున్నారు. యోగాలో శ్వాస నియంత్రణ అంటే ప్రాణయ, ఆసనం .. యోగా నిద్ర వంటి అంశాలు ఉంటాయి. ఇది శరీరం, మనస్సు రెండింటినీ రిలాక్స్ చేస్తుంది. అదే సమయంలో జిమ్ వ్యాయామంలో శక్తి శిక్షణ ఉంటుంది. ఇది జీవక్రియ. కండరాలకు మంచిది. నిపుణుల అభిప్రాయం ప్రకారం మీ శరీర తత్వాన్ని తెలుసుకోండి. మరింత సౌకర్యవంతంగా ఉన్న వాటిని ఆచరించండి.





# వెజిటేరియన్స్ ఎక్కువగా ఉన్న దేశాలెంటో తెలుసా

కొంతమంది చిన్నప్పటి నుంచీ మాంసాహారులు అయినప్పటికీ.. కారణాలు ఏమైనా కాలక్రమంలో శాకాహారులుగా మారిపోతున్నారు. ఇంకొంత మంది పుట్టినప్పటి నుంచీ శాకాహారులుగా ఉన్నా తదనంతర కాలంలో మాంసాహారులవుతున్నారని అంటుంటారు. ఏది ఏమైనప్పటికీ.. ఎవరు ఎలా మారినప్పటికీ.. శాకాహారం తినడమా, మాంసాహారం తినడమా అనేది పూర్తిగా వ్యక్తిగత ఎంపికనే చెప్పాలి. అయితే ఇటీవల కాలంలో ప్రపంచవ్యాప్తంగా చలా మంది ఇప్పుడు శాకాహారాన్ని అవలంభిస్తున్నారని అంటుంటారు. లైఫ్ స్టైల్ ఛేంజ్ లో భాగంగా ఆహారపు అలవాట్లనూ మారుస్తున్నారు. కొంతమంది హెల్త్ కాన్సియస్ కాస్త ఎక్కువగా ఉండి కూడా ఇలాంటి నిర్ణయాలు చేస్తున్నారని చెబుతుంటారు. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా శాకాహారుల సంఖ్య పెరుగుతుందని అంటుంటారు.

**శాకాహారులు ఎక్కువగా ఉన్న టాప్ - 5 దేశాలు...**

**భారతదేశం:**

అత్యధిక సంఖ్యలో శాకాహారం తినేవారు ఎక్కువగా ఉన్న దేశాల్లో అగ్రస్థానంలో ఉంది భారత్. ఇక్కడ ఉన్న జనాభాలో సుమారు 30శాతం మందికి పైగా ప్రజలు శాకాహారమే తింటారని చెబుతున్నారు. ఈ శాతంలో ప్రధాన వాటా హర్యానా, రాజస్థాన్ లలో నివసిస్తున్న ప్రజలని అంటుంటారు!

**ఇజ్రాయెల్:**

ఇజ్రాయెల్ జనాభాలో సుమారు 13 శాతం మంది ప్రజలు శాకాహారులే. మనిషి తన ఆకలిని తీర్చుకోవడానికి జంతువులను చంపడాన్ని సమర్థించలేమని ఇక్కడ నివసించే కొంతమంది ప్రజానీకం బలంగా నమ్ముతారంట.

**తైవాన్:**

శాఖాహర ఆహారాన్ని భుజించే జనాభా ఎక్కువగా ఉన్న దేశాల్లో తైవాన్ మూడో స్థానంలో ఉంది. ఇక్కడున్న మొత్తం జనాభాలో 12 శాతం మంది ఇక్కడ శాకాహారాన్నే అనుసరిస్తున్నారు. ఇక్కడ వెజ్ రెస్టారెంట్స్ చాలానే ఉన్నాయి.

**ఇటలీ:**

ఇటలీ జనాభాలో సుమారు 10 శాతం మంది ప్రజలు వెజిటేరియన్స్. వాస్తవానికి ఇటలీ నాన్ వె వంటకాలకు ఎక్కువ ప్రసిద్ధి చెందినప్పటికీ.. ఇక్కడ శాకాహారుల సంఖ్య కూడా వేగంగా పెరుగుతోందని తాజా నివేదికలు చెబుతున్నాం

**ఆస్ట్రియా:**

ప్రపంచ వ్యాప్తంగా శాకాహార ఆహారాన్ని అనుసరించే వ్యక్తుల విషయంలో ఆస్ట్రియా ఐదో స్థానంలో ఉంది. ఇక్కడ సుమారు 9 శాతం మం



# పరగడపున పనీర్ తింటే.. బోలెడు లాభాలు

చీజ్ అని కూడా పిలువబడే పనీర్, వివిధ రకాల వంటకాలలో ఉపయోగించగల బహుముఖ ప్రయోజనాలు, రుచికరమైన పదార్థం. కానీ., ఉదయాన్నే పనీర్ తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని మీకు తెలుసా..? మీ అల్పాహార దినచర్యలో పనీర్ చేర్చడం మీ మొత్తం శ్రేయస్సుకు ప్రయోజనకరంగా ఉండటానికి వివిధ కారణాలను ఒకసారి చూద్దాం.

**ప్రోటీన్ పుష్కలంగా:**

పనీర్ అధిక నాణ్యత ప్రోటీన్ యొక్క గొప్ప మూలం. ఇది మీ రోజును ప్రారంభించడానికి అనువైన ఆహారంగా మారుతుంది. కణజాలాలను నిర్మించడానికి, మరమ్మతు చేయడానికి, అలాగే ఆరోగ్యకరమైన ఎముకలు, కండరాలు, చర్మాన్ని నిర్వహించడానికి ప్రోటీన్ అవసరం.

**జీవక్రియను పెంచుతుంది:**

ఉదయాన్నే పనీర్ తినడం ద్వారా, మీరు మీ జీవక్రియను పెంచుకోవచ్చు. వేగవంతమైన జీవక్రియ బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఇంకా రోజంతా మీకు మరింత శక్తిని అందిస్తుంది.

**మీకు కడుపు నిండుగా అనిపించేలా చేస్తుంది:**

పనీర్ అనేది మిమ్మల్ని ఎక్కువ కాలం సంతృప్తిగా, కడుపు నిండుగా ఉండేలా చేయడానికి సహాయపడే ఒక నింపే ఆహారం. ఇది రోజు చివరిలో అనారోగ్యకరమైన ఆహారాలను అతిగా తినడం, అల్పాహారం తీసుకోవడం నివారించవచ్చు.

**అవసరమైన పోషకాలను అందిస్తుంది:**

పనీర్ కాల్షియం, భాస్వరం, విటమిన్ ఎ, బి 12 వంటి విటమిన్లకు మంచి మూలం. బలమైన ఎముకలు, దంతాలు, మొత్తం రోగనిరోధక శక్తిని నిర్వహించడానికి ఈ పోషకాలు ముఖ్యమైనవి.

**రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది:**

ఉదయం పనీర్ తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది డయాబెటిస్ లేదా ఇన్సులిన్ నిరోధకత ఉన్నవారికి ముఖ్యమైనది. పనీర్ లోని ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు రక్తప్రవాహంలోకి చక్కెర శోషణను నెమ్మదిస్తాయి.





## హైదరాబాద్ రంజీ జట్టు కెప్టెన్‌గా సిరాజ్

- **మొదటి రెండు మ్యాచ్‌లకు సిరాజ్ సారథ్యం**
- **వైస్ కెప్టెన్‌గా ఎడమచేతి వాటం పేసర్ సీవీ మిలింద్**
- **జాతీయ జట్టు విధుల్లో సిరాజ్ ఉంటే మిలింద్ కెప్టెన్సీ**
- **15 మంది సభ్యులతో జట్టును ప్రకటించిన సీనియర్ సెలక్షన్ కమిటీ**

**డీడీ9 వార్త :**

టీమిండియా స్టార్ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్‌కు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) కీలక బాధ్యతలు అప్పగించింది. 202627 రంజీ ట్రోఫీ సీజన్‌లో భాగంగా మొదటి రెండు మ్యాచ్‌లకు హైదరాబాద్ జట్టుకు సిరాజ్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ మేరకు హెచ్‌సీఏ అధికారికంగా ప్రకటించింది. ఎడమచేతి వాటం పేసర్ సీవీ మిలింద్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు.
సీనియర్ సెలక్షన్ కమిటీ 15 మంది సభ్యులతో కూడిన జట్టును ఎంపిక చేసింది. ఒకవేళ జాతీయ జట్టుకు ఆడాల్సి వస్తే, సిరాజ్ అందుబాటులో లేని మ్యాచ్‌లకు మిలింద్ కెప్టెన్సీ బాధ్యతలు చేపడతాడని హెచ్‌సీఏ స్పష్టం చేసింది. జట్టులో అనుభవజ్ఞులైన బ్యాటర్లు తన్మయ్ అగర్వాల్, రాహుల్ సింగ్, వికెట్ కీపర్లు రాహుల్ రదేశ్, సాయి ప్రజ్ఞయ్ రెడ్డిలకు చోటు దక్కింది. వీరితో పాటు ఎం.అభిరత్ రెడ్డి, కె.హిమతేజ, వరుణ్ గౌడ్, తనయ్ త్యాగరాజన్, అనికేత్ రెడ్డి, సీటీఎల్ రక్షణ్ రెడ్డి, అజయ్ దేవ్‌గౌడ్, రుతిక్ యాదవ్ మెండే, సాయి వికాస్ రెడ్డి జట్టులో ఉన్నారు.
రంజీ సీజన్‌లో భాగంగా హైదరాబాద్ తన తొలి మ్యాచ్‌ను అక్టోబర్ 11న త్రిపురతో ఆడనుంది. అయితే, ఈ మ్యాచ్ వేదిక ఇంకా ఖరారు కాలేదు. అనంతరం అక్టోబర్ 18 నుంచి విశాఖపట్నంలో ఆంధ్ర జట్టుతో తలపడనుంది.
ప్రస్తుతం సిరాజ్ వెస్టిండీస్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లో భారత జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. ఈ సిరీస్ అక్టోబర్ 3న న్యూ ఛండీగఢ్‌లో ముగుస్తుంది. ఆ తర్వాత అక్టోబర్ 22 నుంచి న్యూజిలాండ్ పర్యటన ప్రారంభం కానుండటంతో, సిరాజ్ లభ్యతను బట్టి హెచ్‌సీఏ ఈ నిర్ణయం తీసుకుంది.



## ఆసియా క్రీడలు.. భారత్ ఖాతాలో తొలి పతకం

- **షూటింగ్‌లో రజతంతో భారత్ బోణీ**
- **ఎంఎంఏలో చారిత్రక పతకం ఖాయం చేసిన సుచిక**
- **ఉజ్బెకిస్తాన్‌ను చిత్తు చేసిన మహిళల హాకీ జట్టు**
- **వుషు, టెక్‌బాల్ క్రీడల్లో నిరాశ**
- **సెమీఫైనల్లో బంగ్లాదేశ్‌తో మహిళల క్రికెట్ జట్టు పోరు**

ఆసియా క్రీడల తొలిరోజే భారత్ పతకాల ఖాతా తెరిచింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో భారత షూటర్లు రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఇలవేనిల్ వలరివన్, సోనమ్ మస్కర్, విదర్సా వినోద్‌లతో కూడిన బృందం చైనా తర్వాత రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించింది. ఈ టోర్నీలో భారత్‌కు ఇదే తొలి పతకం.

**ఎంఎంఏలో చరిత్ర సృష్టించిన సుచిక**

మరోవైపు, మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ (ఎంఎంఏ)లో సుచిక సెమీఫైనల్‌కు దూసుకెళ్లి చరిత్ర సృష్టించింది. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించడం ద్వారా ఆమె భారత్‌కు ఈ క్రీడలో తొలి పతకాన్ని ఖాయం చేసింది.

**భారత మహిళల హాకీ జట్టు భారీ విజయం**

ఇక భారత మహిళల హాకీ జట్టు తమ ఆరంభ మ్యాచ్‌లో ప్రభంజనం సృష్టించింది. పూల్ మ్యాచ్‌లో ఉజ్బెకిస్తాన్‌పై ఏకంగా 190 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించి తమ ప్రచారాన్ని ఘనంగా ప్రారంభించింది.

**కొన్ని విభాగాల్లో భారత్‌కు నిరాశ**

అయితే, కొన్ని విభాగాల్లో భారత్‌కు నిరాశ ఎదురైంది. వుషులో పురుషుల చాంగ్‌క్వాన్ ఫైనల్‌లో సూరజ్ సింగ్ 11వ స్థానంతో సరిపెట్టుకోవడంతో పతకం ఆశలు గల్లంతయ్యాయి.అలాగే, టెక్‌బాల్‌లోనూ భారత్‌కు పతకాలు దక్కలేదు. మహిళల సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్ కాంస్య పతక మ్యాచ్‌లలో భారత క్రీడాకారులు ఓటమి పాలయ్యారు. ఇప్పుడు అందరి దృష్టి మహిళల క్రికెట్ జట్టుపై ఉంది. గోల్డ్ మెడల్ మ్యాచ్‌లో స్థానం కోసం హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని జట్టు సెమీఫైనల్లో బంగ్లాదేశ్‌తో తలపడనుంది.






# టీమిండియాతో ఇంత త్వరగా టీ20 మ్యాచ్.. జపాన్ కోచ్ ఆశ్చర్యం

- **భారత్‌తో మ్యాచ్ జరగనుందని నెల క్రితం వరకు తమకు తెలియదని చెప్పిన జపాన్ కోచ్**
- **ప్రధానుల స్థాయిలో జరిగిన చర్చల ఫలితంగానే ఈ మ్యాచ్ సాధ్యమైందని వెల్లడి**
- **ప్రపంచ ఛాంపియన్‌తో ఆడటం తమకు దక్కిన అద్భుతమైన అవకాశమని వ్యాఖ్య**
- **ఈ మ్యాచ్ ద్వారా జపాన్‌లో భవిష్యత్ తరాలకు స్ఫూర్తినివ్వడమే తమ లక్ష్యమన్న కోచ్**

**డీడీ9 వార్త :**

ప్రపంచ ఛాంపియన్ భారత్‌తో టీ20 మ్యాచ్ ఆడతామనే విషయం నెల రోజుల క్రితం వరకు తమకు కనీసం తెలియదని జపాన్ క్రికెట్ జట్టు హెడ్ కోచ్ డుగాల్ బెడింగ్‌ఫీల్డ్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. ఇదొక ఊహించని, అద్భుతమైన అవకాశమని అభివర్ణించాడు. ఇరు దేశాల ప్రధానుల స్థాయిలో జరిగిన ఉన్నతస్థాయి చర్చల తర్వాతే ఈ మ్యాచ్ హఠాత్తుగా ఖరారైందని బెడింగ్‌ఫీల్డ్ వెల్లడించాడు. ఈ చారిత్రక మ్యాచ్ కోసం తమ జట్టు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తోందని తెలిపాడు.
మంగళవారం టోచిగి ప్రిఫెక్చర్‌లోని సానో అంతర్జాతీయ క్రికెట్ గ్రౌండ్‌లో సుజుకి కప్ కోసం భారత్, జపాన్ జట్ల మధ్య ఈ టీ20 మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే ఈ మ్యాచ్ టికెట్లన్నీ అమ్ముడయ్యాయి. మరో రెండు రోజుల్లో ప్రారంభం కానున్న ఆసియా క్రీడలకు సన్నాహకంగా ఈ మ్యాచ్ ఉపయోగపడనుంది. ఆసియా క్రీడల్లో శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని భారత జట్టు నేరుగా క్వార్టర్ ఫైనల్స్‌లో ఆడనుండగా, జపాన్ తన తొలి మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్థాన్‌తో తలపడనుంది.
ఐఏఎన్ఎస్ వార్తా సంస్థతో ప్రత్యేకంగా మాట్లాడుతూ బెడింగ్‌ఫీల్డ్ పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. "ఈ మ్యాచ్ గురించి విన్నప్పుడు మొదట నమ్మలేకపోయాం. ఇది వందకు వంద శాతం మాకు ఆశ్చర్యం కలిగించింది. ప్రపంచ నంబర్ వన్ జట్టుతో ఆడేందుకు ఇదొక అద్భుతమైన అవకాశం. జపాన్‌లో నివసిస్తున్న భారతీయులు కూడా ఈ మ్యాచ్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మైదానంలో గొప్ప వాతావరణం ఉంటుందని ఆశిస్తున్నాం" అని అన్నాడు.
అయితే, జట్టు సన్నద్ధతకు కొన్ని సవాళ్లు ఉన్నాయని బెడింగ్‌ఫీల్డ్ అంగీకరించాడు. "మా ఆటగాళ్లు దేశవిదేశాల్లోని వివిధ ప్రాంతాల్లో ఉంటారు. మే నెల తర్వాత మా పూర్తి జట్టు కలిసి శిక్షణ తీసుకుంది ఇప్పుడే. టెక్నాలజీ సాయంతో ఆటగాళ్లను సమన్వయం చేస్తున్నాం. మరోవైపు, వర్ష సూచన కూడా ఆందోళన కలిగిస్తోంది. అయినా, మ్యాచ్ సజావుగా సాగుతుందని ఆశిస్తున్నాం" అని తెలిపాడు.



భారత జట్టు ఫైర్‌పవర్‌ను ఎదుర్కోవడం పెద్ద సవాలని బెడింగ్‌ఫీల్డ్ పేర్కొన్నాడు. "భారత్ వంటి మేటి జట్ల ఆటగాళ్ల విధ్వంసక శక్తి ముందు కొన్నిసార్లు చిన్న జట్లు కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. అయితే, ఈ ఒత్తిడిని అధిగమించి, మైదానంలో గట్టి పోటీ ఇవ్వాలని మేం లక్ష్యంగా పెట్టుకున్నాం" అని వివరించాడు.
2020లో అండర్19 ప్రపంచకప్‌లోనూ భారత జట్టుతో తలపడిన అనుభవాన్ని గుర్తు చేసుకున్నాడు. ఆనాడు యశస్వి జైస్వాల్, రవి బిష్ణోయ్ వంటి ఆటగాళ్లున్న భారత జట్టు చేతిలో తమ జట్టు ఓడిపోయిందని, అది గొప్ప అనుభవమని అన్నాడు. ఇప్పుడు సీనియర్ల స్థాయిలో మరోసారి భారత్‌తో ఆడటం ఆసక్తికరంగా ఉందని తెలిపాడు.
ఈ మ్యాచ్ ఫలితంతో సంబంధం లేకుండా, జపాన్‌లో క్రికెట్‌కు ప్రాచుర్యం కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని బెడింగ్‌ఫీల్డ్ స్పష్టం చేశాడు. "మా ప్రదర్శన ద్వారా జపాన్‌లో భవిష్యత్ తరాల క్రీడాకారులకు స్ఫూర్తినివ్వాలనుకుంటున్నాం. వేలాది మంది పిల్లలు క్రికెట్‌ను తమ క్రీడగా ఎంచుకునేలా చేయడమే మా అంతిమ లక్ష్యం" అని తెలిపాడు.
భారత్‌జపాన్ దౌత్య సంబంధాల 75 వసంతాల వేడుకలో భాగంగా ఈ మ్యాచ్ ఏర్పాటు చేశారు. సెప్టెంబరు 22న జపాన్ లోని సానో ఇంటర్నేషనల్ గ్రౌండ్ లో ఈ చారిత్రక మ్యాచ్ జరగనుంది.

## షఫాలీ శతక విధ్వంసం.. బంగ్లా బేజారు.. సూపర్ విక్టరీతో ఫైనల్‌కు భారత్

- **సెమీ ఫైనల్లో బంగ్లాదేశ్‌పై 114 పరుగుల భారీ విజయం**
- **కేవలం 49 బంతుల్లో అజేయ శతకం బాదిన షఫాలీ వర్మ**
- **భారత మహిళల జట్టు ఆసియా క్రీడల ఫైనల్‌కు అర్హత**
- **భారీ లక్ష్య ఛేదనలో 81 పరుగులకే కుప్పకూలిన బంగ్లాదేశ్**

**డీడీ9 వార్త :**




ఆసియా క్రీడల మహిళల క్రికెట్‌లో భారత జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. యువ ఓపెనర్ షఫాలీ వర్మ ఆకాశమే హద్దుగా చెలరేగి అద్భుత శతకంతో కదం తొక్కడంతో సెమీ ఫైనల్‌లో బంగ్లాదేశ్‌పై భారత్ 114 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది.
ఈ విజయంతో స్వర్ణ పతక పోరుకు అర్హత సాధించి, పతకాన్ని ఖాయం చేసుకుంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన భారత జట్టు, బంగ్లాదేశ్‌ను చిత్తుగా ఓడించింది.
ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్, ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. ఓపెనర్లు షఫాలీ వర్మ, స్మృతి మంధాన బంగ్లా బౌలర్లపై విరుచుకుపడ్డారు. కేవలం 28 బంతుల్లోనే 50 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ క్రమంలో మంధాన 16 బంతుల్లో 27 పరుగులు చేసి ఔటైనా, పవర్ ప్లే ముగిసేసరికి భారత్ వికెట్ నష్టానికి 72 పరుగులతో పటిష్ఠ స్థితిలో నిలిచింది.
మరోవైపు షఫాలీ తన జోరును కొనసాగించింది. కేవలం 24 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసుకుని బంగ్లా బౌలింగ్‌ను చీల్చి చెండాడింది. అనంతరం కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌తో జతకలిసిన షఫాలీ, మరో కీలక భాగస్వామ్యాన్ని నిర్మించింది. వీరిద్దరూ కలిసి 50 పరుగులకు పైగా జోడించి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ఈ క్రమంలో షఫాలీ తన విధ్వంసక ఇన్నింగ్స్‌ను కొనసాగిస్తూ కేవలం 49 బంతుల్లోనే అజేయ శతకాన్ని పూర్తి చేసుకుంది.
ఆమె ఇన్నింగ్స్‌లో 9 భారీ సిక్సర్లు, 3 ఫోర్లు ఉన్నాయి. 204.08 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసిన షఫాలీ చివరి వరకు క్రీజులో నిలిచింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 33 బంతుల్లో 40 పరుగులతో ఆమెకు అండగా నిలవడంతో, భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 195 పరుగుల భారీ స్కోరు సాధించింది.
196 పరుగుల భారీ లక్ష్య ఛేదనతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్, ఆరంభం నుంచే తీవ్ర ఒత్తిడికి గురైంది. భారత బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్ ధాటికి క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. పవర్ ప్లే ముగిసే సమయానికే 39 పరుగులకు 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ తర్వాత కూడా బంగ్లా ఇన్నింగ్స్ ఏ దశలోనూ కోలుకోలేదు.
భారత బౌలర్లు విజృంభించడంతో 9 ఓవర్ల తర్వాత 49 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. చివరకు 15.4 ఓవర్లలో కేవలం 81 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో భారత జట్టు 114 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి ఫైనల్లో అడుగుపెట్టింది. ఈ అద్భుత ప్రదర్శనతో భారత జట్టు స్వర్ణ పతకంపై కన్నేసింది.

# టీ20 క్రికెట్‌లో స్మృతి మంధాన సంచలనం.. బాబర్, బట్లర్‌లను వెనక్కి నెట్టి ప్రపంచ రికార్డు!

- **టీ20ల్లో అత్యధిక పరుగుల ప్రపంచ రికార్డు నెలకొల్పిన స్మృతి మంధాన**
- **పురుషులు, మహిళల క్రికెట్‌లో అగ్రస్థానానికి చేరిన భారత వైస్ కెప్టెన్**
- **న్యూజిలాండ్ క్రీడాకారిణి సూజీ బేట్స్‌ను అధిగమించి ఈ ఘనత**
- **ఆసియా క్రీడల సెమీఫైనల్‌లో బంగ్లాదేశ్‌పై మెరుపు ఇన్నింగ్స్‌తో రికార్డు**

**డీడీ9 వార్త :**

భారత మహిళా క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్, స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన తన కెరీర్‌లో మరో అద్భుతమైన మైలురాయిని అందుకుంది. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. పురుషులు, మహిళల క్రికెట్‌లో కలిపి అత్యధిక పరుగులు సాధించిన క్రీడాకారిణిగా ఆమె ప్రపంచ రికార్డు నెలకొల్పింది. ఆసియా క్రీడల సెమీఫైనల్‌లో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ అరుదైన ఘనతను ఆమె సొంతం చేసుకుంది.
కొరోగి స్పోర్ట్స్ పార్క్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో మంధాన కేవలం 19 బంతుల్లో 37 పరుగుల మెరుపు ఇన్నింగ్స్ ఆడింది. ఈ క్రమంలో న్యూజిలాండ్ మాజీ క్రీడాకారిణి సూజీ బేట్స్ పేరిట ఉన్న రికార్డును ఆమె అధిగమించింది.
ఈ మ్యాచ్‌కు ముందు మంధాన 170 ఇన్నింగ్స్‌లలో 4,751 పరుగులతో రెండో స్థానంలో ఉండగా, రికార్డు బ్రేక్ చేయడానికి కేవలం 8 పరుగులు అవసరమయ్యాయి. తన ఇన్నింగ్స్ ఆరంభంలోనే రెండు ఫోర్లు, రెండు సింగిల్స్‌తో ఈ మార్కును సులభంగా దాటేసింది. తాజా రికార్డుతో మంధాన 171 ఇన్నింగ్స్‌లలో 4,788 పరుగులతో అగ్రస్థానానికి చేరుకుంది.
ఈ జాబితాలో మంధాన, సూజీ బేట్స్ (4,758) తర్వాత పురుషుల టీ20ల్లో అగ్రగామిగా ఉన్న పాకిస్థాన్ కెప్టెన్ బాబర్ ఆజం (4,596) మూడో స్థానంలో ఉన్నాడు. వీరి తర్వాత జోస్ బట్లర్ (4,292), భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (4,287) వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో కొనసాగుతున్నారు. ఈ రికార్డుతో మంధాన పురుషుల క్రికెట్‌లోని అగ్రశ్రేణి ఆటగాళ్లను కూడా వెనక్కి నెట్టడం విశేషం.
ఇక ఆసియా క్రీడల సెమీఫైనల్ విషయానికొస్తే, ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. 2023లో జరిగిన హాంగ్‌జౌ గేమ్స్‌లో స్వర్ణ పతకం గెలుచుకున్న భారత జట్టు, ఈసారి కూడా టైటిల్‌ను నిలబెట్టుకోవాలని పట్టుదలతో ఉంది. అంతకుముందు క్వార్టర్‌ఫైనల్‌లో ఆతిథ్య జపాన్‌ను ఓడించి సెమీస్‌కు చేరుకుంది.





# 'టైగర్ 3' దర్శకుడితో సారా?

బాలనటిగా కెరీర్ ఆరంభించి.. ప్రస్తుతం అగ్రతారల అవకాశాల్ని అందుకుంటూ కెరీర్‌లో మంచి జోష్ మీదుంది బాలీవుడ్ యువకథానాయిక సారా అర్జున్. ఈ మధ్యే 'ధురంధర్' చిత్రాల్లో తనదైన నటనతో ఆకట్టుకొని బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ఈ తార.. ఇప్పుడు మరో కొత్త ప్రాజెక్ట్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. 'టైగర్ 3' ఫేమ్ మనీశ్ శర్మతో ఓ చిత్రం కోసం సారా చేతులు కలిపినట్లు సమాచారం. "పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా దీన్ని తీర్చిదిద్దాలనుకుంటున్నారు దర్శకుడు. ఇందులో సారా సరసన 'సప్నే వర్సెస్ ఎవ్రీవన్' చిత్రంతో మంచి క్రేజ్ తెచ్చుకున్న అంబ్రీశ్ వర్మ కనిపించనున్నారు. ప్రస్తుతం చిత్రబృందం నాయికతో చర్చలు చేస్తోంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలున్నాయి" అని బాలీవుడ్ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి.



కోలీవుడ్ క్యూట్ అండ్ టాలెంటెడ్ బ్యూటీ ప్రియాంక మోహన్ క్రేజ్ ఇప్పుడు పీక్స్‌కి వెళ్లిపోయిందనడంలో అతిశయోక్తి లేదు. ఏ భాషలో చూసినా వరుస ఆఫర్లతో ఈ అమ్మడు దూసుకుపోతున్న తీరు చూసి నెటిజన్లు సైతం షాక్ అవుతున్నారు. ప్రస్తుతం ఆమె చేతిలో 'అరసన్', 'మంజనత్తి', 'కవిన్-9' లాంటి క్రేజీ ప్రాజెక్ట్‌లు ఉండగా, తాజాగా టాలీవుడ్ నుంచి మరో అదిరిపోయే బంపర్ ఆఫర్ ఆమె ఖాతాలో చేరినట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు వైరల్ అవుతూ హాట్ టాపిక్‌గా మారాయి. ఇటీవల 'ఇరుముడి'తో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న మాస్ మహారాజా రవితేజ, టాలెంటెడ్ డైరెక్టర్ వివేక్ ఆత్రేయ క్రేజీ కాంబినేషన్‌లో రాబోతున్న భారీ చిత్రంలో ప్రియాంక మోహన్ హీరోయిన్‌గా ఫిక్స్ అయినట్లు సమాచారం. భారీ విజయంతో ఫుల్ జోష్‌లో ఉన్న రవితేజ సరసన ఈ బ్యూటీ జోడీ కడుతుండటం విశేషం. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ పనులు శరవేగంగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే వచ్చే అక్టోబర్‌లో దసరా పండుగ కానుకగా ఈ మూవీని అఫీషియల్‌గా పట్టాలెక్కించాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. లక్ష్మణ్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని, వచ్చే ఏడాది సమ్మర్ స్పెషల్‌గా థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. రవితేజ - వివేక్ ఆత్రేయ కాంబోకి ప్రియాంక మోహన్ గ్లామర్ తోడవడంతో, ఈ సినిమాపై అప్పుడే భారీ అంచనాలు క్రియేట్ అయిపోయాయి.



## వరుస ఆఫర్లతో దూసుకుపోతున్న ప్రియాంక మోహన్..

# మరోసారి తల్లిదండ్రులైన దీపికరణ్‌వీర్

బాలీవుడ్ తారలు దీపికా పదుకొణె, రణ్‌వీర్ సింగ్ దంపతులు మరోసారి తల్లిదండ్రులయ్యారు. తాజాగా ఈ శుభవార్తని సామాజిక మాధ్యమాల వేదికగా అభిమానులతో పంచుకున్నారు. 'వెల్‌కమ్ బేబీ గర్ల్..' అనే క్యాప్షన్‌తో తమ రెండో కుమార్తెకి స్వాగతం పలికారు. ఈ జంట 2018లో కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి తొలి సంతానంగా 2024లో కుమార్తె దువా పదుకొణె జన్మించిన విషయం తెలిసిందే. ఇప్పుడామె.. తన చిట్టి చెల్లెలికి తల్లిదండ్రులతో కలిసి స్వాగతం పలికింది. ఈ సందర్భంగా బాలీవుడ్ నటీనటులు దీపిక, రణ్‌వీర్ దంపతులకు నెట్టింట శుభాకాంక్షలు తెలిపారు.



# 'కల్ట్' విడుదల ఖరారు

విష్వక్‌సేన్ కథానాయకుడిగా నటిస్తూ... దర్శకత్వం వహించిన చిత్రం '(హ్యాష్‌ట్యాగ్) కల్ట్'. గాయత్రి భరద్వాజ్ కథానాయిక. తారక్ సినిమాస్ పతాకంపై సందీప్ కాకర్ల నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని అక్టోబరు 30న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టుగా శనివారం అధికారికంగా ప్రకటించాయి సినీ వర్గాలు. నిజ జీవితంలో జరిగిన కొన్ని కలవరపరిచే సంఘటనల స్ఫూర్తితో రూపొందిస్తున్న చిత్రమిదని, విష్వక్‌సేన్ తొలిసారి భిన్న ఛాయలున్న పాత్రలో కనిపించనున్నట్టు సినీ వర్గాలు తెలిపాయి. తారక్ పొన్నప్ప, మురళీశర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, కార్తికేయ, అనిరుధ్ భాస్కర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంభాషణలు: తరుణ్ భాస్కర్, సంగీతం: రవి బస్రూర్, ఛాయాగ్రహణం: అరవింద్ విశ్వనాథన్, కూర్పు: రవితేజ గిరిజాల, ప్రొడక్షన్ డిజైన్: అరవింద్ మ్యూల్.






## రెండు భాగాలూ... ఏకకాలంలో!

కొనసాగింపు చిత్రాలు, యూనివర్స్ సినిమాలు, ఫ్రాంచైజీలు... ఇలా కొత్త కొత్త పేర్లతో ఈ మధ్య సినిమాలు సందడి చేస్తున్నాయి. అగ్ర కథానాయకుల చిత్రాలనగానే ఈ పేర్లు కచ్చితంగా ప్రచారంలోకి వస్తుంటాయి. పెద్ద కథలు, భారీ హంగుల కారణంగా ఆయా కథల్ని, కథా ప్రపంచాల్ని ఒక భాగంతో సరిపెట్టకుండా... తదుపరి కూడా కొనసాగించేందుకు ప్రయత్నిస్తుంటారు దర్శకనిర్మాతలు. అది మార్కెట్ వ్యూహంలో ఓ భాగం కూడా! ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'డ్రాగన్' కథ కూడా పలు భాగాలుగా కొనసాగనుందని సమాచారం. చాలావరకు సినిమాలు ఒక భాగం ప్రేక్షకుల ముందుకొచ్చాకే, మరో భాగం పనులు మొదలవుతుంటాయి. అయితే 'డ్రాగన్' మాత్రం ఏకకాలంలోనే రెండు భాగాల చిత్రీకరణని పూర్తి చేసుకొంటోందని సమాచారం.

తొలి భాగం విడుదలైన కొన్ని రోజుల్లోపే, మరో భాగాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చే వ్యూహంతో చిత్రబృందం పనిచేస్తున్నట్టు సమాచారం. అందుకే కథానాయకుడు ఎన్టీఆర్ గాయం కారణంగా కొన్ని రోజులుగా సెట్‌కి దూరంగా ఉంటున్నప్పటికీ, 'డ్రాగన్' చిత్రీకరణ మాత్రం కొనసాగుతోంది. ఎన్టీఆర్ లేని సన్నివేశాల్ని ఇతర తారాగణంపై తెరకెక్కిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ చిత్రంలో ఎన్టీఆర్ లూగర్ పాత్రలో సందడి చేయనున్న విషయం తెలిసిందే. రుక్మిణీ వసంత్ కథానాయికగా నటిస్తున్నారు. అనిల్ కపూర్ ముఖ్యభూమిక పోషిస్తున్నారు.

బాలీవుడ్ తారలు అలియాభట్, షాహిద్ కపూర్ కూడా ఇందులో కీలక పాత్రల్ని పోషించనున్నట్టు తెలుస్తోంది. ఎన్టీఆర్ ఆర్ట్స్, మైత్రీ మూవీ మేకర్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.

# 'చిరు లీక్స్'.. 'కాకా'లో తన పాత్ర పేరు చెప్పేసిన చిరంజీవి

చిరంజీవి (Chiranjeevi) కథానాయకుడిగా బాబీ దర్శకత్వరంలో రూపొందుతున్న చిత్రం 'కాకా'. (kaaka movie) ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ మూవీ సంక్రాంతి కానుకగా జనవరి 13న (kaaka movie release date) ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల చిరు పుట్టినరోజు సందర్భంగా టైటిల్‌తో పాటు, గ్లింప్స్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. తన సినిమాలకు సంబంధించి చిరంజీవి ముందే లీక్స్ ఇస్తుంటారు. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన 'కాకా'లో తన పేరు వెల్లడించారు. ఇందులో ఆయన 'కదిరి కాళిదాస్'గా నటిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఇది సామాజిక మాధ్యమాల్లో ట్రెండ్ అవుతోంది.



## ఆ సమయంలో మానసికంగా
# చాలా ఇబ్బంది పడ్డా..



బాలీవుడ్ హాట్ బ్యూటీ నోరా ఫతేహి తన కెరీర్ తొలినాళ్లలో పడ్డ కష్టాల గురించి తాజాగా ఒక పాడ్‌కాస్ట్‌లో ఆసక్తికరమైన విషయాలు పంచుకున్నారు. ఆమె గతంలో హిందీ బిగ్‌బాస్ సీజన్9లో వైల్డ్ కార్డ్ కంటెస్టెంట్‌గా ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై మాట్లాడుతూ.. మొదట రియాలిటీ షోలను తాను చాలా చిన్నచూపు చూసేదానినని, కానీ తర్వాత పరిస్థితుల కారణంగా తన నిర్ణయం మార్చుకోవాల్సి వచ్చిందని నోరా తెలిపారు. ఆ సమయంలో తాను వరుసగా కొన్ని పాటల్లో నటించినప్పటికీ, తనకు రావాల్సిన రెమ్యునరేషన్ అందలేదని ఆమె చెప్పారు. నిర్మాతలు ఏజెన్సీకి డబ్బులు చెల్లించి ఉండవచ్చు కానీ, తనకు మాత్రం పైసలు రాలేదని అన్నారు. డబ్బుల కోసం తాను ప్రొడ్యూసర్లతో గొడవ పడాల్సి వచ్చిందని, ఆ సమయంలో మానసికంగా చాలా ఇబ్బంది పడ్డానని తెలిపింది. సరిగ్గా అదే సమయంలో బిగ్‌బాస్ టీమ్ నుంచి తనకు ఆఫర్ వచ్చిందని చెప్పారు.

మొదట తాను ఆ షో చేయడానికి ససేమిరా ఒప్పుకోలేదని, తమకు తన ప్లానింగ్ ఏమిటో అర్థం కావడం లేదని వాళ్లతో వాదించినట్లు ఆమె గుర్తుచేసుకున్నారు. అయితే ఆ షో ఇస్తున్న భారీ మొత్తాన్ని చెప్పగానే తన ఆలోచన మారిపోయిందని నోరా చెప్పారు. డబ్బుల కోసమే తాను ఆ షోకి వెళ్లినట్లు ఆమె తెలిపారు. రియాలిటీ షోలు అంత చెడ్డవి కాదని, పైగా అవి మిమ్మల్ని క్షణాల్లో పాపులర్ చేస్తాయని ఆమె అభిప్రాయపడ్డారు. తాను వైల్డ్ కార్డ్ ద్వారా వెళ్లాను కాబట్టి ఎక్కువ రోజులు ఉండాల్సిన పనిలేదని భావించానని చెప్పారు. అంతేకాకుండా అదే ఛానెల్‌లో ప్రసారమయ్యే 'ఝలక్ దిఖ్లా జా' షో చేయాలని తాను బలంగా కోరుకున్నానని, అందుకే బిగ్‌బాస్‌కు వెళ్లేందుకు ఒక కండీషన్ పెట్టినట్లు వెల్లడించారు. బిగ్‌బాస్ చేస్తే తనకు 'ఝలక్ దిఖ్లా జా' అవకాశం ఇవ్వాలని ఛానెల్ వారిని కోరగా, వారు అంగీకరించడంతోనే తాను బిగ్‌బాస్‌లోకి అడుగుపెట్టినట్లు నోరా క్లారిటీ ఇచ్చారు.

This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500204. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.